Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు The people's Verdict తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 241 | హైదరాబాద్ | బుధవారం 15 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# ఆర్‌ఆర్‌ఆర్ ఆరంభించండి

ఉత్తర భాగం నిర్మాణ పనుల ప్రారంభానికి కేంద్ర కేబినెట్ అనుమతి ఇప్పించండి

ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు ఇవ్వండి

రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించండి

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అటవీశాఖ అనుమతులు ఇప్పించండి

కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర కేబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో రేవంత్ భేటీ అయ్యారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఆర్‌ఆర్‌ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుతుందని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని వివరించారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునరి?వభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి

- మిగతా 2వ పేజీలో



## క్యూర్‌లో ఎల్ఐజీ వర్గాలకు లక్ష ఇళ్లు

- 20న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- తొలి దశలో నియోజకవర్గానికి 500-1,000 ఇళ్లు
- మంత్రి పొంగులేటి

హైదరాబాద్: క్యూర్ పరిధిలో ఈ నెల 20న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుడుతున్నామని రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ ఎల్‌ఐజీ కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్లను కట్టనున్నట్లు చెప్పారు. తొలి దశలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి

- మిగతా 2వ పేజీలో

# ఇరకాటంలో కమలం!

## రేవంత్ ప్లాన్‌లో పావులుగా.. నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల బాధ్యత వారికే..

### వస్తే రాష్ట్రానికి మంచి.. లేకుండా కార్నర్ చేసే అవకాశం

### సమన్వయం అంటూనే సరికొత్త ప్లాన్.. బీజేపీ ఎంపీలపై ఒత్తిడి...

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

అభివృద్ధి కోసం కలిసి నడుద్దాం.. ఇదో సరికొత్త రాజకీయ ఒరవడి అంటూనే అన్ని పార్టీల ఎంపీలతో ఢిల్లీ వేదికగా ఓ సమన్వయ సమావేశం నిర్వహించి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. ఇది బీజేపీ ఎంపీలపై ఒత్తిని పెంచుతోంది.

**రేవంత్ మైండ్ గేమ్..**

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని పార్టీల ఎంపీలతో నిర్వహించిన సమావేశం వెనుక ఆయన మాస్టర్ మైండ్ కనిపిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, కేంద్రంలో ఉన్నది ఎన్డీయే ప్రభుత్వమే. అందుకే, రాష్ట్రానికి రావలసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల సాధన బాధ్యతను పరోక్షంగా బీజేపీ ఎంపీల భుజస్కంధాలపైనే వేసేలా ఆయన స్కెచ్ వేశారు. "మీరు కేంద్రంలో అధికారంలో ఉన్నారు.. తెలంగాణకు రావాల్సిన హక్కుల కోసం మీరే గళం విప్పాలి అంటూ బీజేపీ ఎంపీలను సున్నితంగా కార్నర్ చేశారు. దీనివల్ల రేపు ఒకవేళ కేంద్రం నుంచి రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో ప్రాజెక్టులు సాధించుకుంటే క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవచ్చు, ఒకవేళ కేంద్రం వివక్ష చూపితే దానికి స్థానిక బీజేపీ ఎంపీల అసమర్థతనే కారణమంటూ ప్రజల్లోకి బలంగా వెళ్ళవచ్చనేది రేవంత్ ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.



**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేసిన ఓ అడుగు తెలంగాణలోని బీజేపీ ఎంపీలను ఇరకాటంలో పెట్టింది. వస్తే కొండ.. లేదంటే అన్న చందంగా నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ బీజేపీ ఎంపీల భుజాలపై మోపారు. దీంతో వారి పరిస్థితి కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్న తీరుగా మారింది. రేవంత్ వ్యూహంతో వారు ఏం చేయాలో తోచని స్థితిలో పడిపోయారు.**

**ఆ ఇద్దరికీ బాధ్యతలు..**

రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, టెక్స్‌టైల్ పార్కుకు నిధులు, హైదరాబాద్ మెట్రో రెండో విడత విస్తరణకు పర్మిషన్లు, అలాగే జీఎస్టీ బకాయిల విడుదలకు సంబంధించి సమగ్ర సమాచారంతో కూడిన ఫైళ్లను సీఎం ఎంపీలందరికీ అందజేశారు. ప్రధానంగా కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి మంత్రులు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో గట్టి వాయిస్ వినిపించే ఈటల రాజేందర్, జాతీయ స్థాయిలో పలుకుబడి ఉన్న కొండా విశ్వేశ్వర్ రెడ్డిలను రేవంత్ ఈ సమన్వయానికి వేదికగా ఎంచుకోవడం విశేషం. తాము కేవలం రాజకీయాలు చేయడం లేదని, అభివృద్ధి కోసం ప్రతిపక్షాలతో కలిసి నడవడానికి కూడా సిద్ధమని నిరూపించేలా రేవంత్ ఇమేజ్ బిల్డింగ్ చేసుకున్నారు. ఈ భేటీ ద్వారా రేవంత్ రెడ్డి ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా వ్యవహరించారు. ఒకవైపు కేంద్రానికి సహకరించడం లేదని తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూనే, మరోవైపు రాష్ట్రంలో తాము మాత్రమే రైతులు, ప్రజల పక్షపాతిగా ఉన్నామని నిరూపించేందుకు సిద్ధమయ్యారు. పార్లమెంట్ వేదికగా రాష్ట్ర సమస్యలపై కాంగ్రెస్ ఎంపీలు కొట్లాడుతుంటే, బీజేపీ ఎంపీలు దానికి బాటలు వేయాల్సిన పరిస్థితిని కల్పించారు.



## సౌదీపై హౌతీల దాడి

అభా ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణులు

సనాలో తమ ప్రతినిధులున్న విమానంపై యెమెన్ దాడికి ప్రతీకారం

ఒమన్ తీరంలో రెండు నౌకలపై ఇరాన్ దాడి

భారతీయుడు మృతి..

దాడులను ఖండించిన భారత్

సనా/రియాద్, జూలై 14: ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం ముగియలేదని, పశ్చిమాసియా రణభూమిగా మారిందని, రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు చల్లారట్లేదని ఒకవైపు యావత్ ప్రపంచం ఆందోళన చెందుతుంటే ఇప్పుడు మరో యుద్ధం తెరమీదకు వచ్చింది. హౌతీ అనే యెమెన్‌కు చెందిన తిరుగుబాటు సంస్థ మంగళవారం సౌదీలోని అభా అంతర్జాతీయ విమానాశ్రయంపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. అక్కడితో ఆగకుండా విమానాశ్రయాన్ని తమ ఆధీనంలోకి

- మిగతా 2వ పేజీలో



## ఈసారి 90 కోట్లు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ అరెస్ట్

రవీందర్‌తోపాటు బంధువులు, బినామీల ఇళ్లపై ఏసీబీ దాడులు

భారీగా ప్లాట్లు, ఫ్లాట్లు, బంగారం, నగదు గుర్తించిన అధికారులు

బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ.90 కోట్లు

-2లో



## ట్రంపరితనం తెచ్చిన తంటా!

అగ్రరాజ్యం అమెరికా ఏకాకి అవుతోందా? మిత్రులు ముఖం చాటేస్తున్నారా? అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు ఆర్థికంగా గుదిబండలవుతున్నాయి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం అవును అంటున్నారు జాన్ ఫైనర్. న్యూయార్క్‌టైమ్స్ పత్రికలో ఈయన రాసిన కథనం ప్రకారం అధ్యక్షుడి తెంపరితనం కాస్తా పౌరులకు వందల కోట్ల డాలర్ల నష్టం తీసుకొచ్చింది. మిత్రదేశాలనూ వదలకుండా చేస్తున్న హెచ్చరికలు అంతర్జాతీయంగా అమెరికా ఒంటరయ్యేందుకు కారణమవు తోందని విశ్లేషిస్తున్నారు.అధ్యక్షుడిగానే కాదు.. అంతకుముందు కూడా డొనాల్డ్ జే ట్రంప్ వైఖరి వివాదాస్పదమే. ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం కావచ్చు. వివాహం, అక్రమసంబంధాలు, పన్నులు ఎగ్గొట్టడం.. ఇలా బోలెడన్నిసార్లు అంతర్జాతీయంగా చర్చల్లో నిలిచారు. అయితే రెండోసారి గద్దెనెక్కిన తరువాత ఈ వివాదాల జోరు మరింత పెరిగిందేమో అన్న అంచనాలు ఏర్పడ్డాయి. మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్(మాగా) నినాదంతో ఎన్నికల్లో విజయం సాధించాక అక్రమ వలసదారులు, టారిఫ్‌లు, వీసాల వంటి విషయాల్లో ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు పలుమార్లు విమర్శలకు గురయ్యాయి. ఈ నేపథ్యంలోనే న్యూయార్క్ టైమ్స్ కాలమిస్ట్

- మిగతా 2వ పేజీలో

## బాలెన్‌షాకు జెన్‌జీ సెగ

నేపాల్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కొన్నాళ్లకే వ్యతిరేకత

బైక్ రైడర్ ఆత్మహత్యపై భగ్గుమన్న యువత



ఖాత్మాండు, జూలై 14: జెన్‌జీ తరం మద్దతుతో నేపాల్ ప్రధాని అధిరోహించిన బాలెన్ షా, పట్టుమని నాలుగు నెలలైనా గడువముందే తిరిగి జెన్‌జీ తరం నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారు. దేశ రాజధాని ఖాత్మాండులో బైక్ పార్కింగ్ విషయంలో మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానైంది. నో-పార్కింగ్ జోన్‌లో గణేష్ అనే బైక్ రైడర్ తన వాహనాన్ని నిలిపినందుకు ట్రాఫిక్ పోలీసులు తాళం వేశారు. దీంతో సదరు రైడర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. క్షతగాత్రున్ని అక్కడి యంత్రాంగం న్యూఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించగా, మరుసటి రోజే మరణించాడు. గిగ్ వర్కర్ మృతి అంశం నేపాల్‌లో పెద్ద దుమారానికి తెరలేపింది. జెన్‌జీ యువత పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి దేశ రాజధానిలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేపాలీ కాంగ్రెస్ ఎంపీ బసనా థాపా మాట్లాడుతూ.. ఒక యువకుడు యంత్రాంగం

- మిగతా 2వ పేజీలో



## సింగరేణిని నష్టాల ఊబిలోకి నెట్టారు!

భరోసా యాత్రలో భారాస, కాంగ్రెస్‌లపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఆదిలాబాద్, గోదావరిఖని, మంచిర్యాల సిటీ, శ్రీరాంపూర్, మల్హార్: గత భారాస ప్రభుత్వం లాగే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సింగరేణిని దోచుకుంటోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. కష్టనష్టాల్లో కూరుకుపోయిన సంస్థను బతికించే బాధ్యత భాజపా తీసుకుందని.. త్వరలోనే కార్మికులకు కేంద్రం మరో శుభవార్త తెలియజేయనుందని హామీ ఇచ్చారు. మంగళవారం 'సింగరేణి భరోసా యాత్ర'లో భాగంగా మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కిషన్‌రెడ్డితోపాటు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం పర్యటించింది. శ్రీరాంపూర్, క్యాతనపల్లి, మంచిర్యాల, గోదావరిఖని, మల్హార్‌లలో ఏర్పాటు చేసిన సభలు, కార్మికులతో

- మిగతా 2వ పేజీలో

# క్యూర్‌లో ఎల్‌ఐజీ వర్గాలకు లక్ష ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గానికి 500–1,000 ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. సచివాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్లపై నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. "ఇప్పటికే లక్ష ఇందిరమ్మ ఇళ్లకు పరిపాలన అనుమతులు ఇచ్చాం. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబు, మంత్రి అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాలను ప్రకటిస్తాం. హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి కార్పొరేషన్‌ల పరిధిలో స్థలాలను గుర్తించాం. ఈ ప్రాంతాలను ఇప్పటికే హౌసింగ్ శాఖ అధీనంలోకి తీసుకుంది. ఎక్కడ ఎన్ని ఇళ్లు నిర్మించాలి.. ఎన్ని అంతస్తుల్లో నిర్మించాలి.. ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం ఎంత.. భవనం ఆకృతి వంటి వాటిపై సీఎంతో చర్చించి రెండు, మూడు రోజుల్లో తుది రూపు ఇస్తాం. గత ప్రభుత్వం హైదరాబాద్‌కు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా రెండు పడక గదుల ఇళ్లను నిర్మించడంతో పేదలు జీవనోపాధికి ఇబ్బంది పడ్డారు. ఇప్పుడు ఆ పరిస్థితి తలెత్తకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్లను నిర్మించి ఇస్తున్నాం. స్థలాలపై యాజమాన్య హక్కులను కూడా కల్పిస్తాం" అని పొంగులేటి తెలిపారు.

లబ్ధిదారులు సోషల్ మీడియాలో పంచుకోవడం ఆనందంగా ఉంది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన రోజు నుంచి గృహప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్ధిదారులు సోషల్ మీడియా ద్వారా పంచుకోవడం ఆనందంగా ఉందని పొంగులేటి పేర్కొన్నారు. చాలా మంది లబ్ధిదారులు తమ ఇళ్లను చూపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఎక్స్‌లో సంతోషం వ్యక్తం చేశారు. 'పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నాం. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలు" అని స్పందించారు. బాలెన్‌షాకు జెన్‌జీ సెగ మండి పడ్డారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ను నేరస్థుడిలా లాక్కెళ్లారే తప్ప ఆంబులెన్స్ పిలవలేదని ఆరోపించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఎంపీ విష్ణు బహదూర్ కూడా ప్రధాని బాలెన్ షా నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నల్ల అద్దాలు తీసి ప్రధాని ప్రజల కష్టాలను చూడాలని ప్రతిపక్షానికి చెందిన ఓ ఎంపీ ఎద్దేవా చేయగా.. మరికొందరు ప్రధాని తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యంత్రాంగం ప్రజలను పీడిస్తున్నదని, వారిపై అపరాధ రుసుములు, జరిమానాలు విధించడం దారు ణమని మండిపడ్డారు. ప్రతిపక్షాల విమర్శలపై హోంమంత్రి స్పందించారు. రైడర్ మృతికి కారణమైన ముగ్గురు ట్రాఫిక్ పోలీసు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశించారు.

### ఆర్ఆర్ఆర్ ఆరంభించండి

మంజూరు చేస్తే హైదరాబాద్––విజయవాడ మధ్య 100 కి.మీ. దూరం తగ్గుతుందని, సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు.

# అటవీశాఖ అనుమతులు ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

మన్ననూరు––శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి కేంద్ర అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. అలాగే, హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణను తాము చేపడతామని తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.



# నష్టాల ఊబిలోకి నెట్టారు!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సమావేశాల్లో నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ.. 'రెండు ప్రభుత్వాలు సంస్థ బొగ్గును వినియోగించుకున్నా రావాల్సిన బకాయిలు ఇప్పించలేకపోయాయి. దీంతో కార్మికులకు వేతనాలు చెల్లించడానికి సింగరేణి ప్రతి నెలా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. నైనీ బొగ్గు బ్లాకును కేంద్రం సింగరేణికి కేటాయిస్తే.. అప్పటి సీఎం కేసీఆర్ ఏనాడూ అక్కడి ప్రభుత్వంతో మాట్లాడింది లేదు. ఒడిశాలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత నైనీ పనులు వేగవంతం చేయించాం. ఇప్పుడు ఆ అభివృద్ధి పనుల టెండర్ల కోసం రాష్ట్ర మంత్రులు కుమ్ములాడుకుంటున్నారు. సింగరేణి అంటే తెలంగాణకు గౌరవం.. కార్మికుల ఆత్మగౌరవం. అందుకే కార్మికులంతా జెండాలు పక్కన పెట్టి సింగరేణిని రక్షించేందుకు నడుం బిగించాలి' అని పేర్కొన్నారు.

### దోపిడీ, అక్రమాలకు నిలయంగా..

'కేంద్ర మంత్రిగా తెలంగాణ భవిష్యత్తు ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీతో మాట్లాడి తాడిచర్ల గని కేటాయింపునకు చొరవ తీసుకున్నా. ఈ బాహుబలి గని నుంచి 40–50 ఏళ్ల వరకు బొగ్గు ఉత్పత్తి చేయవచ్చు. దాదాపు 7 వేల మందికి ఉపాధి లభిస్తుంది. భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో సింగరేణి సంస్థ అన్ని రకాలుగా దోపిడీ, కమీషన్లు, అక్రమాలలో కూరుకుపోయింది. భారాస హయాంలో రూ.26 వేల కోట్లు సింగరేణికి కేసీఆర్ అప్పు పెట్టారు. రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంస్థను నిర్లక్ష్యం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి టోకు వ్యాపారం చేస్తుండగా, ఆయన ఎమ్మెల్యేలు చిల్లర వ్యాపారం చేస్తూ సింగరేణిని నష్టాల్లోకి నెట్టారు. సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.60వేల కోట్లు ఇవ్వడం లేదు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు 118 బ్లాక్‌లకు అనుమతి ఇస్తే రూ.2.60 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయి. మోదీ నేతృత్వంలోని మా ప్రభుత్వం 12 ఏళ్లుగా నీతిమంతమైన పాలన అందిస్తోంది' అని తెలిపారు.

### మాట విస్మరిస్తున్న రెండు పార్టీలు

భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. 'ఇచ్చిన మాటల్ని విస్మరించడంలో కాంగ్రెస్, భారాస ప్రభుత్వాలు ఒకే తరహాలో పోటీపడుతున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి అవినీతికి పెద్దపీట వేస్తోంది' అని ధ్వజమెత్తారు. శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి నెలా రూ.వెయ్యి కోట్లు ఈ ప్రభుత్వం లూటీ చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీలు ఈటల రాజేందర్, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి, రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నేతలు రఘునాథరావు, వెంకటేశ్ నేత, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈసారి 90 కోట్లు

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజినీర్ అరెస్ట్
- రవీందర్‌తోపాటు బంధువులు, బినామీల ఇళ్లపై ఏసీబీ దాడులు
- భారీగా ప్లాట్లు, ఫ్లాట్లు, బంగారం, నగదు గుర్తించిన అధికారులు
- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ.90 కోట్లు

హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరో లంచగొండి అధికారిపై కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీలో (హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలపై కేసు నమోదు చేసింది. వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన ఏసీబీ సిటీ రేంజ్––1 అధికారులు ఆయన బినామీలను గుర్తించడంతోపాటు కీలక సమాచారం సేకరించారు. దీని ఆధారంగా మంగళవారం హై దరాబాద్, నిజామాబాద్‌ల్లో ఏకకాలంలో తొమ్మిది ప్రాంతా ల్లో సోదాలు నిర్వహించారు. వీటిలో రవీందర్ ఇల్లు, కార్యాలయంతోపాటు ఆయన బంధువులు, బినామీల ఇళ్లుఉన్నాయి.

### ప్లాట్లు.. ఫ్లాట్లు.. వ్యవసాయ భూములు

రవీందర్ తన ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని అవినీతి, అక్రమ మార్గాల ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చేసిన సోదాల్లో కొండకల్, కిస్తాపూర్, పసుమాములలో ఐదు ప్లాట్లకు సంబంధించిన పత్రాలు లభించాయి. వీటి అధికారిక విలువ రూ.38,89,700గా ఏసీబీ నిర్ధారించింది. అలాగే నార్సింగి, నానక్‌రామ్‌గూడల్లో రూ.2,07,40,000 విలువైన నాలుగు ఫ్లాట్లు, కొత్తూరు మండలం గూడూరు గ్రామం, శంషాబాద్‌ల్లో రూ.6 లక్షల విలువైన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, రూ.1,33,58,800 విలువైన మోకిలాలోని శ్రీవారి మెడోస్‌లో 300 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న విల్లా, రూ.3 కోట్ల విలువైన కొండాపూర్‌లోని మసీదు బండ ప్రాంతంలో 300 చదరపు గజాల్లో నిర్మించిన జీ౦4 భవనానికి సంబంధించిన పత్రాలు స్వాదీనం చేసుకున్నారు. అలాగే, రూ.3.82 లక్షల నగదు, 1.44 కేజీల బంగారం, 12.5 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయన ఇంట్లో రూ.17,24,000 విలువైన గృహోపకరణాలు, రూ.9.32 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, రూ.1.16 కోట్ల విలువైన నాలుగు వాహనాలు (ఇన్నోవా హైక్రాస్, టాటా సఫారి, ఇన్నోవా క్రిస్టా, మహీంద్రా ఎక్స్‌యూవీ) స్వాధీనం చేసుకున్నారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.45,05,776 బ్యాలెన్స్ ఉన్నట్లు గుర్తించారు. ఈ స్థిరచరాస్తుల విలువ అధికారిక లెక్కల ప్రకారం రూ.9,24,02,276 ఉంటుందని ఏసీబీ అధికారులు ప్రకటించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.90 కోట్ల కు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు లో ఉందని, రవీందర్‌ను అరెస్టు చేశామని అధికారులు ప్రకటించారు. విచారణ అనంతరం బుధవారం ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. రవీందర్‌తోపాటు ఆయన కుటుంబీకులు, బినామీలకు సంబంధించిన ఇతర స్థిరచరాస్తులు గుర్తించే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.



### భారీ ప్రాజెక్టుల్లో కీలకంగా..

గత ప్రభుత్వ హయాంలో బీఎల్ఎన్ రెడ్డి చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలను నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. ఆ తరువాత సీనియర్ ఇంజనీర్ పరంజ్యోతి కొంతకాలం చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. సీనియారిటీలో భాగంగా రవీందర్‌కు ఈ పదవి దక్కింది. అప్పటి వరకు ఆయన హెచ్‌ఎండీఏ అనుబంధ సంస్థ అయిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) సీజీఎంగా పనిచేశారు. ఇంజనీరింగ్ విభాగంలో వివిధ హోదాల్లో పని చేశారు. ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణం మొదలుకొని దాన్ని ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇవ్వడం వరకు ఆయన హెచ్‌జీసీఎల్ కేంద్రంగా పనిచేశారు. రెండేళ్ల క్రితం చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత సికింద్రాబాద్––శామీర్‌పేట్, ప్యారడైజ్––డెయిరీఫామ్ వంటి భారీ ఎలివేటెడ్ ప్రాజెక్టులు, నగరవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఔటర్‌ను, ప్రధాన కాలనీలను అనుసంధానం చేసే లింకురోడ్లు, కొత్వాల్‌గూడఎకో పార్కు నిర్మాణం, రావిర్యాల నుంచి ఫ్యూచర్‌సిటీ మీదుగా ఆమన్‌గల్ వరకు గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు––1, అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు గ్రీన్‌ఫీల్డ్‌రోడ్––2 వంటి ప్రాజెక్టులను చేపట్టారు. మరోవైపు బిడ్డింగ్ నోటిఫికేషన్‌లు మొదలుకొని బిడ్‌ల కేటాయింపు, కాంట్రాక్టర్‌ల ఎంపిక, అంచనాల రూపకల్పన, నిధుల కేటాయింపు వంటి అంశాల్లో ఇంజనీరింగ్ విభాగం ఎంతో కీలకమైంది. కాగా, ఏసీబీ దాడులు హెచ్‌ఎండీఏలోని ఇంజనీరింగ్, ప్లానింగ్, తదితర విభాగాల్లోని అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాయి. మంగళవారం ఉదయమే ఏసీబీ దాడుల వార్తలు తెలియడంతో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పలువురు అధికారులు కార్యాలయానికి కూడా రాకుండా దూరంగా ఉండిపోయారు. అదీగాక ఇటీవలి కాలంలో తరచుగా ఏసీబీ దాడులు జరుగుతుండటంతో కొందరు అధికారులు నిర్ణీత పనివేళల్లో కాకుండా ఏదో ఒక సమయంలో మాత్రమే ఆఫీసుకు వచ్చి వెళ్తున్నారు.

# సౌదీపై హౌతీల దాడి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంది. సౌదీలో ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నప్పుడు, ఆ దేశస్తులు పర్వతశ్రేణులుండే అభా ప్రాం తానికి వెళ్తారు. పర్వతాల మధ్య ఉండే ఈ ఎయిర్‌పోర్టునే హౌతీ టార్గెట్ చేసిం ది. అయితే..దాడిలో ఆస్తినష్టం, ప్రాణనష్టంపై ఇప్పటివరకు సౌదీ ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. తమ ప్రతినిధుల బృందాన్ని తరలిస్తున్న ఇరాన్ విమానం సోమవారం సనా విమానాశ్రయంలో రన్‌వేపై దిగుతుండగా సౌదీఅరేబియా మద్దతు ఉన్న యెమెన్ ప్రభుత్వం బాంబు దాడి చేసిందని, ఆ దాడికి ప్రతిగానే తాము ప్రతిదాడికి పాల్పడ్డామని హౌతీ ప్రకటించింది. తాజా దాడితో 2022 నుంచి ఇరుపక్షాల మధ్య కొనసాగుతున్న అనధికారిక ప్రశాంతత ఒక్కసారిగా బద్దలయినట్లయింది. తమ ప్రతినిధులను ఖైదీలుగా యెమెన్ ప్రభుత్వం బంధించిందని, వారిని విడిచిపెట్టాలనే నాడు హౌతీ గట్టిగా ప్రయత్నాలు చేసింది. ఒక దశలో యెమెన్ ప్రభుత్వంతో సంప్రదింపులు కూడా జరిపింది. కానీ, ఆ ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో అప్పటినుంచి హౌతీ నివురుగప్పిన నిప్పులా స్తబ్ధుగా ఉండిపోయింది. యెమెన్ ప్రభుత్వం సుమారు 10 ఏళ్ల నుంచి అంతర్యుద్ధాన్ని ఎదుర్కొంటున్నది. బాహ్య శక్తుల ప్రాక్సీ యుద్ధాలకు తాళలేక విలవిలలాడుతున్నది. 2014లో హౌతీలు రాజధాని సనా నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడంతో, అక్కడి ప్రభుత్వం ఆడెన్ నగరాన్ని తమ తాత్కాలిక రాజధానిగా మార్చుకోవాల్సి వచ్చింది. ఈక్రమంలోనే సౌదీ అరేబియా నేతృత్వంలో 2015లో ఒక సైనిక కూటమి ఏర్పాటైంది. ఈ కూటమి హౌతీ సంస్థను తుదముట్టించేందుకు రంగంలోకి దిగింది. నాడు ఇరుపక్షాల మధ్య జరిగిన దాడుల్లో వేలాది మంది పౌరులు మృతిచెందారు. 2022లో సౌదీ అరేబియా సైనిక కూటమి– హౌతీ తిరుగుబాటుదారుల మధ్య అనధికార కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో, అప్పటి నుంచి ఉద్రిక్తతలు ఆగిపోయాయి. కానీ, తాజా పరిణామాలు ఇరుపక్షాల మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెంచేలా పరిణమించాయి.

### అమెరికా సాయం కోరిన సౌదీ

తమ దేశంలోని విమానాశ్రయంపై హౌతీ దాడులకు పాల్పడిన నేపథ్యంలో సౌదీ ప్రభుత్వం అప్రమత్తమైంది. హౌతీపై సైనిక దాడులకు దిగేందుకు సాయం చేయాలని అమెరికాను కోరినట్లు తెలిసింది. సాయం అందించేందుకు అగ్రరాజ్యాధినేత ట్రంప్ కూడా సానుకూలంగా స్పందించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు ప్రసారమవుతున్నాయి.

### ఇరాన్ బాధ్యత వహించాలి: యెమెన్

సనా విమానాశ్రయంపై ఉన్న దిగ్బంధాన్ని ఎత్తివేసే వరకు సౌదీ గగనతలంలోకి ఏ విమానయాన సంస్థలు వెళ్లొద్దని యెమన్ రక్షణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. తమ దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ విమానం సనా విమానాశ్రయంలోకి ప్రవేశించిందని, అందుకే రన్‌వేపైనా దాడి చేశామని స్పష్టం చేసింది. తమ గగనతలంలోకి వచ్చే ఏ శత్రుదేశ విమానాన్నీ వదిలిపెట్టబోమని హెచ్చరించింది. హౌతీ దాడులకు ఇరాన్ నాయకత్వమే బాధ్యత వహించాలని పేర్కొంది.

### ఒమన్ తీరంలో అలజడి

ఒమన్ సముద్ర జలాల నుంచి వెళ్తున్న యెమెన్‌కు చెందిన 'మొంబాసా', 'అల్ బహియా' అనే రెండు చమురు నౌకలపై మంగళవారం ఇరాన్ సైన్యం దాడులు చేసింది. దాడుల్లో ఒక భారతీయ నావికుడు మృతిచెందాడు. మరో ఎనిమిది మంది క్షతగాత్రులయ్యారు. భారత నావికుడు మృతిపై భారత్ తీవ్రంగా ఖండించింది. నౌకలపై దాడి చేయడమంటే, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ఈమేరకు న్యూఢిల్లీలోని ఇరాన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మొహమ్మద్ జవాద్ హుస్సేనీకి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్లు జారీ చేసింది.

### 20%ట్రాన్సిట్ ఫీజ్.. అంతా తూచ్ ! ట్రంప్ యూటర్న్

వాషింగ్టన్/ టెహ్రాన్, జూలై 14: హోర్ముజ్ జలసంధి నుంచి వెళ్లే ఒక్క నౌక నుంచి 20శాతం రవాణా ఫీజు (ట్రాన్సిట్ టోల్) వసూలు చేస్తామని, జలసంధి తమ నియంత్రణలోనే ఉంటుందని బీరాలు పలికన అగ్రరాజ్య అధినేత ట్రంప్, తన 'ట్రూత్ సోషల్' ద్వారా ప్రకటన విడుదల చేసిన కొద్ది గంటలకే అంతా తూచ్ అన్నారు. రవాణా ఫీజు వసూలు నిర్ణయాన్ని ఉప సంహరించుకున్నట్లు ప్రకటించారు. అందుకు బదులుగా గల్ఫ్ దేశాలు అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడతాయని ప్రకటించారు. పెట్టుబడులతో అమెరికాతోపాటు గల్ఫ్ దేశాలకూ మేలు జరుగుతుందని, లక్షలాది మంది అమెరికన్లకు అధిక వేతనాలతో ఉద్యోగాలు లభిస్తాయని జోస్యం చెప్పారు. అయితే, ఇరాన్ నౌకాయానంపై మాత్రం అమెరికా దిగ్బంధం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ట్రంపరితనం తెచ్చిన తంటా!

(మొదటి పేజీ తరువాయి)

వేధింపులకు బలైపోతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించిందని జాన్ ఫైనర్ ఈ తెంపరి నిర్ణయాల తాలూకూ ఆర్థిక భారంపై వివరణాత్మక విశ్లేషణ ఒకటి చేశారు. దాని ప్రకారం ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధం కారణంగా అమెరికాలో ఇప్పటికే పెట్రోలు, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పెట్రోలు, డీజిల్ ధరలు సుమారు 15 శాతం వరకూ పెరగ్గా, యూరియా ధర ఏకంగా యాభై శాతం ఎక్కువైంది. డీఏపీ కోసం 27 శాతం ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఈ పెంపు కాస్తా అమెరికన్లపై ఇప్పటికే సుమారు 13,200 కోట్ల డాలర్ల ఆర్థిక భారం మోపిందని అంచనా.

### తగ్గిన పర్యాటకులు, విద్యార్థులు...

కఠిన వీసా నిబంధనలు అమలు చేయడం, యుద్ధభయం వంటి కారణాలతో అమెరికాకు వస్తున్న పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2024తో పోలిస్తే 2025లో అమెరికాకు వచ్చిన పర్యాటకుల సంఖ్య సుమారు 40 లక్షలు తక్కువ. ఫలితంగా ఆర్థిక వ్యవస్థకు 800 కోట్ల డాలర్ల నష్టం జరిగిందని లెక్కలేస్తున్నారు. వీసాల విషయంలో తీసు కొస్తున్న మార్పుల కారణంగా భారత్‌తోపాటు అనేక ఇతర దేశాల విద్యార్థులు అమెరికాకు కాకుండా ఇతర యూరోపియన్ దేశాలకు మళ్లుతూండటం గమనార్హం. ఫలితంగా అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో చేరే విద్యార్థులు 2024తో పోలిస్తే 2025లో 17 శాతం తక్కువైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2026కు సంబంధించిన పూర్తి వివరాలు లభ్యం కాలేదు కానీ ఈ ఏడాది తగ్గుదల సుమారు 10 శాతం వరకూ ఉండవచ్చునని అంచనా. ఫలితంగా ఏటా కనీసం వంద కోట్ల డాలర్ల నష్టం ఉండొచ్చని తెలుస్తోంది.

### యూరప్‌తో మిలటరీ సంబంధాలు

రష్యా ఉక్రెయిన్ యుద్ధ సమయంలోనే అమెరికా, నాటోల మధ్య విపరీతమైన అభిప్రాయభేదాలు బహిర్గతమయ్యాయి. ట్రంప్ ఒంటెత్తు పోకడను పలు దేశాలు బహిరంగంగానే విమర్శించాయి. దీని ఫలితం సుస్పష్టం. 2025లో యూరోపియన్ దేశాలు మిలటరీపై పెట్టిన ఖర్చులు 14 శాతం వరకూ అంటే సుమారు 86,400 కోట్ల డాలర్లకు చేరినా అమెరికా కంపెనీల నుంచి చేసిన కొనుగోళ్లు సగానికి తగ్గడం గమనార్హం. ఇదే సమయంలో అమెరికా పొరుగున ఉన్న కెనడా 15,000 కోట్ల డాలర్లతో యూరోపియన్ డిఫెన్స్ ఫండ్‌లోకి చేరిపోయింది. చైనాతో తన సంబంధాలను సుదృఢం చేసుకునే దిశగా అడుగులేస్తోంది. ఆసియా దేశాల్లో జపాన్ తన మిలటరీ సామర్థ్యాన్ని పదును పెట్టుకుంటోంది. ఇందులో అమెరికా కంపెనీల స్థానంలో దక్షిణ కొరియా కంపెనీలు ముందంజలో ఉన్నాయి. భారత్ కూడా ఏఐ వంటి కీలక టెక్నాలజీల విషయంలో దేశీ కంపెనీలు లేదంటే చైనీస్ కంపెనీల్లో మెరుగైన వాటిని వెతుక్కుంటున్నట్లు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు అమెరికాకు దూరంగా జరుగుతున్నట్లు, ఇందుకు ట్రంప్ తీరు, అమెరికా ప్రభుత్వంలో పెరిగిన అవినీతి, వాణిజ్య వైరాలు, కృత్రిమ మేధ విషయంలో అస్పష్ట వైఖరి, విధానాలు కారణమని కాలమిస్ట్ ఫైనర్ విశ్లేషించారు.

# 'హర్మ్యూజ్ గోల' తప్పించుకునదెలా?

### గల్ఫ్ దేశాల ప్రత్యామ్నాయ వ్యూహాలు

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని ఇరాన్ తెగేదాకా లాగుతుండటంతో... ఇతర మార్గాలపై దృష్టి మొదలైంది. హర్మ్యూజ్ ప్రభావాన్ని తగ్గించేందుకు గల్ఫ్ దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రణాళికలు మొదలెట్టాయి. యుద్ధాలు, ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో చమురు, గ్యాస్ ఎగుమతులు ఒకే సముద్ర మార్గంపై ఆధారపడటం ప్రమాదకరమని భావించిన దేశాలు భారీ పెట్టుబడులతో పైప్‌లైన్లు, కొత్త ఓడరేవులు, భూసంబంధ రవాణా మార్గాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ సముద్ర మార్గ చమురు రవాణాలో గణనీయమైన భాగం హర్మ్యూజ్ ద్వారానే సాగుతోందనేది తెలిసిందే. ఈ జలసంధిపై ఇరాన్‌కున్న భౌగోళిక ఆధిపత్యం కారణంగా, అక్కడ ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ ప్రపంచ ఇంధన మార్కెట్లు, పెట్రో సరఫరాలు కుదేలవుతున్నాయి. దీనిని అధిగమించేందుకు ఏయే దేశాలు ఏం చేస్తున్నా యంటే.. సౌదీ అరేబియా: ఇప్పటికే తూర్పు చమురు క్షేత్రాలను ఎర్ర సముద్రంలోని యన్బు పోర్టుతో కలిపే ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్‌ను సౌదీ అరేబియా ఉపయోగిస్తోంది. ప్రస్తుతం దీని సామర్థ్యాన్ని రోజుకు మరో 20 లక్షల బ్యారెళ్లకు పెంచే పనులు జరుగుతున్నాయి. ఎగుమతుల్లో సుమారు 80 శాతం ఆసియా దేశాలకే వెళ్తుండటంతో, బాబ్ ఎల్ మండెబ్ మార్గంలోని భద్రతా సమస్యలు ఇంకా పెద్ద సవాలుగానే ఉన్నాయి. యూఏఈ: హర్మ్యూజ్‌కు సమర్థమైన ప్రత్యామ్నాయాన్ని రూపొందించిన దేశంగా యూఏఈ నిలిచింది. అబుధాబీ చమురు క్షేత్రాల నుంచి ఒమన్ గల్ఫ్‌లోని ఫుజైరా పోర్టు వరకు ఇప్పటికే ప్రత్యేక పైప్‌లైన్ పనిచేస్తోంది. దీని



సామర్థ్యాన్ని రెట్టింపు చేసే రెండో పైప్‌లైన్‌ను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫుజైరాను విస్తరించి ప్రధాన ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నది యూఏఈ వ్యూహం. కువైట్, బహ్రెయిన్: హర్మ్యూజ్‌ను మూసివేస్తే ఈ రెండు దేశాలు సముద్ర మార్గాన్ని దాదాపు కోల్పోతాయి. దీంతో సౌదీ అరేబియాలోని యన్బు పోర్టుతో అనుసంధానించే కొత్త పైప్‌లైన్ ప్రాజెక్టును పరిశీలిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తవ్వడానికి కనీసం ఐదేళ్లు పట్టే అవకాశం ఉంది. భూసంబంధ రవాణాపై దృష్టి: చమురు మాత్రమే కాకుండా పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతుల కోసం కూడా గల్ఫ్ దేశాలు భూసంబంధ నడవాలను అభివృద్ధి చేయాలని భావిస్తున్నాయి. ఫుజైరా, యన్బు పోర్టులను రైల్వేలు, రోడ్లు, కంటైనర్ టెర్మినళ్లతో అనుసంధానించే ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇరాన్ పట్టు శాశ్వతం కాదు: నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం హర్మ్యూజ్‌పై ఇరాన్‌కు వ్యూహాత్మక ఆధిపత్యం చాలా బలంగా ఉన్నప్పటికీ, ప్రత్యామ్నాయ పైపులైన్లు, కొత్త పోర్టులు, భూసంబంధ రవాణా వ్యవస్థలు పూర్తయ్యే కొద్దీ ఆ ప్రభావం క్రమంగా తగ్గే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాలు నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ మార్గాలు భవిష్యత్తులో ప్రపంచ ఇంధన సరఫరాను మరింత స్థిరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషించే అవకాశముంది.




## కోరుట్లలో "క్యాచ్ ది రైన్", "డ్రై డే" అవగాహన ర్యాలీ నిర్వహణ

**కోరుట్ల జూలై 14 (ప్రజాతీర్పు)**

పట్టణ ప్రజల్లో నీటి సంరక్షణ, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో కోరుట్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ "జల శక్తి అభియాన్ 3.0" కార్యక్రమంలో భాగంగా "క్యాచ్ ది రైన్" (వాన నీటిని ఒడిసి పట్టుకుందాం) మరియు దోమల నివారణ కోసం "ప్రతిరోజు డ్రై డే" కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీకి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తిరుమల వసంత జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర, వైస్ చైర్‌పర్సన్ మహమ్మద్ షాహెద్ ఉల్ అహద్ పాల్గొని జల సంరక్షణ, పరిశుభ్రత యొక్క ప్రాధాన్యతను వివరించారు. పట్టణంలోని పలు వార్డ్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ, పరిశుభ్రత పాటించడం, నిల్వ నీరు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు.




## జూనియర్ చెస్ చాంపియన్షిప్ పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

- 18,19 తేదీల్లో నాల్గవ ఆల్ ఇండియా ఓపెన్ జూనియర్ చేస్ పోటీలు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 14**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18,19 తేదీల్లో నిర్వహించనున్న 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్షిప్--2026 వాల్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెస్ మేధో వికాసానికి దోహదపడే అత్యుత్తమ క్రీడ అని, ఇలాంటి జాతీయ స్థాయి టోర్నమెంట్ల నిర్వహణ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విజేతలకు మొత్తం రూ.1. 25 లక్షల నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నాగరాజు, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు సృజన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



## ప్రగల్లపాడు రైతువేదికలో ఎల్ నినో ప్రభావం గురించి రైతులకు అవగహన సదస్సు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జులై 14**

టేకులపల్లి : ప్రగల్లపాడురైతువేదికలో ఇల్లందు ఏ డి ఏ లాల్ చాంద్ఎల్ నినో ప్రభావం వలన వర్ష పాతం తగ్గే అవకాశం అలాగే పంట దిగుబడుల్లో తగ్గుదల ఉండవచ్చని రైతులకు ఎల్ నినో ప్రభావం గురించి తెలియ జేయడం జరిగినది రైతులు కాలువలు, చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత ను బట్టి వరికి బదులుగా జొన్న సజ్జలు కందులు మినుములు, నువ్వులు అలసందలు, ఆముదం కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలు పండించాలని తెలిపారు భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని,దీర్ఘ కాలిక పొడి పరిస్థితి లో 2 శాతం యూరియా లేదా 1శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకుల పై పిచికారీ చేయాలని రైతులకు సూచించడం జరిగినది ఈ కార్యక్రమం లో సర్పంచ్ కొమరం హనుమంతు ఏ ఈ ఓ ప్రవీణ్ మరియు రైతులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

**నర్సంపేట జూలై 14 ప్రజా తీర్పు**

నర్సంపేట మున్సిపాలిటీకి చెందిన మహేశ్వరం 15వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్థానిక కౌన్సిలర్ ఏపూరి శ్రీనివాస్ రెడ్డి కమిషనర్ కాటం భాస్కర్ తో కలిసి పరిశీలించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందని దానితో పాటుగా వార్డు డంపింగ్ యార్డ్ కొరకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు ప్రజలు, పాల్గొన్నారు..

# మా రక్తం తీసుకో... రైతన్నకు సాగునీరు ఇవ్వు

- సీఎం రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్

**(నారుకట్ల మదు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా ) జూలై 14**



కండ్ల ముందే ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఎండిపోతున్న సీఎం రేవంత్ రెడ్డి రైతన్నలకు నీళ్లు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని.. అడిగితే మిమ్మల్ని కోసి మీ రక్తాన్ని పంటల మీదే చల్లితే పంటలు పండుతాయి అని రైతులను కించపరిచే విధంగా మాట్లాడడం సీఎం స్థాయికి సిగ్గుచేటని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గారు అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వేములవాడ పట్టణములోని చల్మెడ నివాసంలో 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' పేరిట శిబిరం ఏర్పాటు చేసి నాయకులతో కలిసి రక్తదానం చేసి సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కూడా మంత్రి పదవి కోసం, స్థాయిని మరిచి మాటలు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నీళ్లను వెంటనే రైతన్న పంటపొలాలకు మళ్లించేలా చర్యలు తీసుకోకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. దాదాపు 25 మందికి పైగా రక్తదానం చేసి మా రక్తం తీసుకో ..రైతన్నకు నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, జోగిని శంకర్, నాయకులు క్రాంతి కుమార్, గూడూరు మధు, సుంకపాక రాజు, నరాల దేవేందర్, కొండ నరసయ్య, అంజద్ పాషా, నీరటి మల్లేశం, రాపల్లి రాంబాబు, రేగుల రాజేశం, జంగిటి సంజీవ్, నిమ్మశెట్టి రాజు, మామిండ్ల కనకయ్య, పెద్దిరాజు, మంత సందీప్, పబ్బ మహేష్, గోసుకుల నరసయ్య, హనుమంతు, ఉమర్, రఫిక్, ప్రేమ్ చారి, దేవరాజు, నాగుల రాము, మిరియాల సంతోష్, సాయి పటేల్, అసద్, బత్తుల మహేందర్, మండల నాయకులు మల్యాల దేవయ్య, గోపు పరశురాములు, పసుల అంజి, నూకలమర్రి సర్పంచ్ నరేష్, గోపు మధు, గుండెకార్ల నరేష్, బండారి శ్రీనివాస్, రాము గౌడ్, జింక శ్రీధర్, జనార్ధన్, పెండ్యాల శంకర్, సాయి, గడ్డం నరేష్, తదితరులు ఉన్నారు.




## ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్

బీఎల్ఓలకు పలు సూచనలు చేసిన మేయర్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జూలై 14**

నగరంలోని రెండవ డివిజన్ తీగల గుట్టపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఓటరు స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వహణను పరిశీలించిన మేయర్, బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అనర్హుల పేర్ల తొలగింపు, మార్పులు, చేర్పుల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఓటరు నమోదు, మార్పులు, చిరునామా సవరణ తదితర అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు, ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీకి రాజీనామా చేసిన డాక్టర్ రఘు.. జూలై 19న తెలంగాణ రక్షణ సేనలో చేరిక

**కోరుట్ల జూలై 14: (ప్రజాతీర్పు )**



కోరుట్ల మాజీ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రఘు బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీని వీడడం బాధాకరమైన నిర్ణయమే అయినప్పటికీ, అనివార్య పరిస్థితుల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జూలై 19న కోరుట్లలోని కావేరి గార్డెన్స్‌లో కవితమ్మ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేనలో అధికారికంగా చేరనున్నట్లు వెల్లడించారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉపాధి, వ్యవసాయాభివృద్ధి, మహిళా సాధికారత వంటి పార్టీ లక్ష్యాలు తనను ఆకర్షించాయని చెప్పారు. 2001 నుంచి వైద్య సేవలు, 2002 నుంచి నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ చేస్తున్నానని, ట్రస్ట్ ఆశయాలకు తెలంగాణ రక్షణ సేన సిద్ధాంతాలు దగ్గరగా ఉండటంతో ఆ పార్టీలో చేరుతున్నట్లు వివరించారు. బీజేపీలో పనిచేసిన సమయంలో కార్యకర్తల సహకారంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 60 వేల ఓట్లు సాధించామని గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు, కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ ప్రెస్‌మీట్‌లో సుకేందర్ గౌడ్, రెండ్ల రాజన్న, నల్ల వెంకటేష్, అడ్లగట్ట సంతోష్ పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 14**





కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ 4లేబర్ కోడ్స్ ను తీసుకురావడం జరిగిశీదని ఏఐటీసీ నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగ, కార్మిక వర్గానికి వ్యతిరేకమైన కోడ్స్ ను రద్దు చేసేంతవరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. బద్దం ఎల్లారెడ్డి భవన్ గణేష్ నగర్ కరీంనగర్ లో జరిగిన ఏఐటియుసి కరీంనగర్ జిల్లా సమితి ఐదవ మహాసభలో పలు తీర్మానాలు చేయడం జరిగిశీది. భవిష్యత్తులో అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పైన కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం, పెన్షన్ సౌకర్యం, కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్స్ పైన భవిష్యత్తులో పోరాటాలు,ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని మహాసభలో నిర్ణయించడం జరిగినది. అనంతరం జిల్లా నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా కాసేట్టి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులుగా కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా జంగా తిరుపతి యాదవ్ ,బెజ్జంకి కాళిదాస్ , కిమ్మసారపు శ్రీనివాస్, వెల్దండి దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా టేకుమల సమ్మయ్య, సహాయక కార్యదర్శులుగా పిట్టల సమ్మయ్య, డి రజిత, పిట్టల శ్రీనివాస్, కే రజిత, కదారి బీరయ్య, కోశాధికారిగా చిట్ల నిఖిల్, తోపాటు జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులుగా, 20 మందిని ఏఐటీయూసీ కరీంనగర్ జిల్లా సమితి ఐదవ మహాసభల్లో ఎన్నుకోవడం జరిగినది.

## రామడుగు తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల సన్మానం

**రామడుగు, జూలై 14 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రామడుగు మండల నూతన తహసీల్దార్ దాసరి రాజమల్లును స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల రెవెన్యూ పరిపాలనలో విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కట్ట రవీందర్, కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టవేణి అంజిబాబు, మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు ఎం.డి. అల్లావుద్దీన్, సీనియర్ నాయకుడు మునిగంటి శ్రీనివాసాచారి, రామడుగు బీజేపీ బూత్ కన్వీనర్ నాగి లక్ష్మణ్, రంగసాయిపల్లె బీఎల్ఏ 2 మడుపు సత్యనారాయణాచారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఇల్లందు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి: పి .డి. యస్. యు

రిక్వెస్ట్ స్టాప్ కాదు పర్మినెంట్ బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని బస్సు డిపో ముందు ధర్నా

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) జులై 14**




ఇల్లందు :ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద తక్షణమే బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని పి డి యస్ యూ నాయకులు గంగాధర గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలోని బస్ డిపో ముందు పి డి ఎస్ యు ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు అనంతరం డిపో మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ ఇంచార్జ్ సునిత కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బస్సు షెల్టర్ లేకపోవడంతో విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందు పరిసర ప్రాంతాల నుండి బస్టాండ్ కి చేరుకొని కళాశాలకు వెళ్లే విద్యార్థులను కరెంట్ ఆఫీస్ వద్దనే దింపేస్తున్నారని, అదేవిధంగా టేకులపల్లి నుండి వచ్చే విద్యార్థులను సుదిమళ్ళ బస్ స్టాప్ వద్దనే దింపేస్తున్నారని దీని మూలంగా విద్యార్థులు నడక ప్రారంభించి కళాశాలకు చేరుకోవడానికి సుమారు 45 నిమిషాల టైం పడుతుందని దీని మూలంగా విద్యార్థులు కళాశాల టైం కు చేరుకోలేకపోతున్నారని అన్నారు. అంతేకాకుండా 800 మీటర్ల నుండి ఒక కిలోమీటర్ దూరం నడవాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. దీనితో విద్యార్థినీలు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని కళాశాల అధ్యాపక బృందం నుండి స్థానిక ప్రజాప్రతినిధులకు విద్యార్థి సంఘం నుండి అనేక వినతులు సమర్పించినప్పటికీ వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని వారు అన్నారు. కేవలం రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటుచేసి చేతులు దులుపుకోవడం కాదని విద్యార్థులకు పర్మినెంట్గా ఒక బస్ షెల్టర్ ఏర్పాటు చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్, లక్ష్మీ నరసింహ, అఖిల్, రాంచరణ్, హేమచంద్ర, హిమబిందు, అక్షయమీనా, శాంతి, రష్మిక, నందిని, లలిత గాయత్రి తదితరులు పాల్గొన్నారు

# ధర్మపురి పుష్కర ఘాట్లను పరిశీలించిన మంత్రి

దేవాదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్)

జూలై 14



జగిత్యాల జిల్లా ధర్మపురి,2027 గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మపురి గోదావరి పుష్కర ఘాట్లను దేవాదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించిన మంత్రి, పుష్కరాల ఏర్పాట్లపై అధికారులతో విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పుష్కరాలకు సంబంధించిన అన్ని ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ధర్మపురిలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బైపాస్ రోడ్లు, స్నాన ఘాట్లు, టాయిలెట్లు, పార్కింగ్ స్థలాలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, భద్రత వంటి అన్ని మౌలిక సదుపాయాలను అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. అదేవిధంగా ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను తొలి విడతలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల కోసం అదనంగా రూ.50 కోట్ల నిధులను ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని, భక్తులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని కల్పించడంలో ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచేలా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశీలనలో దేవాదాయశాఖ, ఇరిగేషన్, రోడ్లు-భవనాలు, పోలీసు, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొని, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మంత్రికి వివరాలు అందించారు.

## కరువు నివారణకు... ప్రాణహిత జలాలను వినియోగించాలి

- మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) 14.



రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే అవకాశం ఉన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం మేడిగడ్డ దిగువకు ప్రవహిస్తున్న ప్రాణహిత నది జలాలను కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా ఎగువనున్న అన్నారం, సుందిల్లా, ఎల్లంపల్లి బ్యారేజీలకు ఎత్తిపోసే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి తెలిపారు. ఈ నీటిని వినియోగించడం ద్వారా హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్, ఆదిలాబాద్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల తాగునీరు, సాగునీటి అవసరాలను కొంత మేర తీర్చవచ్చని వారు అభిప్రాయపడ్డారు. రామగుండం ఎన్టీపీసీ, సింగరేణి, జెన్‌కో వంటి సంస్థలకు కూడా అవసరమైన నీటి సరఫరా సాధ్యమవుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. రిటైర్డ్ ఇంజినీర్లు ఇచ్చిన సాంకేతిక సూచనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని, ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం కంటే రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి సారించాలని సూచించారు.ప్రాణహిత నది ప్రవాహం తగ్గిన సందర్భంలో కూడా కన్నెపల్లి పంప్ హౌస్ దిగువన తాత్కాలికంగా ఇసుక బస్తాలతో రింగ్ బండ్ ఏర్పాటు చేసి నీటిని మళ్లించి ఎత్తిపోసే అవకాశం ఉందని రిటైర్డ్ ఇంజినీర్లు పేర్కొన్నారని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం, మేడిగడ్డ బ్యారేజీలో నీటి నిల్వ మరమ్మతుల అనంతరం మాత్రమే చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత ప్రవాహ పరిస్థితులను అనుసరించి కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశాలను కూడా పరిశీలించవచ్చని తెలిపారు.రాష్ట్రంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని, ప్రాణహిత జలాలను అన్నారం, సుండిల్లా, ఎల్లంపల్లి బ్యారేజీలకు తరలించి రైతాంగం, ప్రజలకు సాగు, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



## గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి

మేకల ప్రభాకర్ యాదవ్

రామడుగు, జూలై 14 (ప్రజాతీర్పు ప్రతినిధి)

గ్రామ పంచాయతీలకు సంబంధించిన వీధి దీపాలు, తాగునీటి సరఫరా విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ డిమాండ్ చేశారు. రామడుగు మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు నిధులు అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తూనే, విద్యుత్ బిల్లుల భారం మాత్రం గ్రామ పంచాయతీలపై మోపడం సరైన విధానం కాదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను గ్రామ పంచాయతీలే చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేయడం అన్యాయమని మండిపడ్డారు. రామడుగు మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సుమారు రూ.6 కోట్ల పెండింగ్ విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి కూడా గ్రామ పంచాయతీలకు ఎలాంటి నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. నియోజకవర్గంలోని రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యేను కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్, సర్పంచ్ దయ్యాల లత వీరమల్లు, ఉపసర్పంచ్‌లు వేముండ్ల కుమార్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు బద్దం లక్ష్మారెడ్డి, దళిత మోర్చా మండల అధ్యక్షుడు సంటి జితేందర్, యువ మోర్చా మండల అధ్యక్షుడు దయ్యాల రాజు, నాయకులు పురేళ్ల రాజశేఖర్, వేముల రమేష్, లంక నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా నిర్వహిస్తాం...

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...
- ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు మంజూరు

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై. 14.



2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహిస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జూన్-2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మంగళవారం ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాల్లో వీఐపీ ఘాట్లు, సాధారణ స్నాన ఘాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, బైపాస్ రోడ్లు, రహదారుల విస్తరణ, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాలు, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, ఉగ్ర నరసింహస్వామి ఆలయం, కోటిలింగాల దేవస్థానం పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులను పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల ప్రణాళికలు, అంచనాలు, కాలపట్టికలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని నాణ్యతతో, వేగంగా పూర్తి చేసేలా తగిన సూచనలు అందించారు. తొలి విడతలో ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలందరూ భగవంతుని ఆశీస్సులతో సుఖసంతోషాలతో జీవించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 2027 గోదావరి పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జూలై-2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేబినెట్ ఉపసంఘం నిర్ణయం మేరకు బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన దేవాలయాల పునరుద్ధరణతో పాటు పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1,000 కోట్లను కేటాయించిందనిఅందులో ధర్మపురి, కోటిలింగాల పుష్కరాల ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం తొలి విడతలో రూ.117 కోట్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ధర్మపురి అభివృద్ధికి మరిన్ని పనులను ప్రతిపాదిస్తూ అదనంగా రూ.50 నుంచి రూ.60 కోట్ల వరకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందులో అమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో వంతెన నిర్మాణం ద్వారా సంతోషీమాత ఆలయానికి అనుసంధానం, ప్రత్యేక వీఐపీ ఘాట్ నిర్మాణం, కోటిలింగాల ఆలయం సమీపంలో డబుల్ రోడ్డు నిర్మాణం వంటి కీలక ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ధర్మపురి, కోటిలింగాలను సందర్శించారని, అధికారులు నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా బాసర, కాళేశ్వరం, వేములవాడ, యాదాద్రి, భద్రాచలం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని, గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి. రాజ గౌడ్, గ్రంథాలయం చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల ఆర్.డి.ఓ. మధుసూదన్, దేవాలయం ఈవో, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ లు, పంచాయతీ రాజ్ ఏఈ లు, రోడ్డు భవనాల శాఖ ఏఈ లు, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డికీ బుద్ధి మారాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పూజలు

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 14

రైతుల పంట పొలాలకు సాగునీరు ఇవ్వాలని అడిగితే ప్రతి పక్ష నేతల రక్తం పారిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలపై మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఫైర్ అయ్యారు. ఈ మేరకు బెల్లంపల్లి పట్టణ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి భాష , బుద్ధి మారాలని కోరుతూ స్థానిక హనుమాన్ మందిర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నయ్య మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న సీఎం స్థాయి వ్యక్తి ఇలా ఆటవిక వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల్లో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉందని, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టుల నుంచి నీళ్లిచ్చే అవకాశం ఉన్నా సీఎం రేవంత్ రెడ్డి రైతులను గోస పెడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి నీళ్లు ఇవ్వకుంటే రైతుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల అమలుపై దృష్టి సారించి అమలు చేయడానికి కృషి చేయాలని హితవు పలికారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆయన అనుచరుల బుద్ధి కూడా మార్చి ప్రభుత్వ భూములు కబ్జా చేయకుండా చూడాలని కూడా ప్రార్ధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, స్థానిక కౌన్సిలర్ బండారి స్రవంతి ప్రవీణ్,పట్టణ ప్రధాన కార్యదర్శి రెవెల్లి విజయ్, పట్టణ నాయకులు, సుందర్ రావు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 14

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ సంస్థాగత నియామకాల్లో విశ్వకర్మలకు ప్రాధాన్యత నివ్వాలి

- విశ్వకర్మ సంఘం జిల్లా నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్ విశ్వకర్మ

(కుమారస్వామి ప్రజాతీపు జగిత్యాల రూరల్) జూలై14



కాంగ్రెస్ పార్టీ మండల సంస్థాగత నియామకాల్లో విశ్వకర్మలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని విశ్వకర్మ సంఘం జిల్లా నాయకులు , వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్ ఓ ప్రకటనలో కోరారు. పార్టీకి విధేయతగా, అంకితభావంతో పనిచేస్తూ పార్టీ కష్ట కాలంలో కూడా పార్టీని నమ్ముకుని ఉండి, పార్టీ అధికారంలోకి రావడానికి శాయశక్తుల కృషిచేసినప్పటికి జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ నియమాకంలో విశ్వకర్మ సామాజిక వర్గాన్ని విస్మరించి మొండి "చేయి" చూపారని, మండల కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల కార్యవర్గ నియామకాల్లోనైనా విశ్వకర్మలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఈ సందర్భంగా పోలోజు శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీ సర్పంచుల, కార్యదర్శులపై గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం మానుకోవాలి

తిమ్మంపేట గ్రామ సర్పంచ్ మోడెం శ్రీలత

నర్సంపేట జూలై 14 ప్రజా తీర్పు



గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి ఆరు నెలలు కావస్తున్నది. ఆ గ్రామ పంచాయతీలలో సర్పంచులుగా గెలిచిన మేము అధికారం చేపట్టినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నెలవారీగా పంపించాల్సిన నిధులను ఒక్క రూపాయి కూడా పంపిణీ చేయలేదు. అలాగే గ్రామపంచాయతీలలో వసూలు చేసిన ఇంటి పన్నులు, నీటి పన్నుల డబ్బులు గ్రామపంచాయతీ అకౌంట్లో జమ చేయించడం జరిగినది. అట్టి డబ్బులను గ్రామపంచాయతీ అవసరాల రీత్యా విడిపించాలని అనుకుంటే ఆ ఎకౌంట్లో ను సీజింగ్ లో పెట్టి ఉన్నందున ఒక రూపాయి కూడా విడిపించుకునే పరిస్థితి లేదు. గ్రామ పంచాయతీలలో ఏ పనులు చేయాలన్నను నిధులు లేక, పనులు చేయలేని పరిస్థితి ఉండగా మరోవైపున ఎంపీ ఓలు, ఇంకా పై అధికారులు అందరూ కలిసి గ్రామ పంచాయితీల విద్యుత్ బిల్లులు చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులపై, సర్పంచులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒక దిక్కు పంచాయతీలో నిధులు లేకుంటే విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయడం విడ్డూరంగా ఉన్నది. ఇప్పటికైనను రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేసి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని అప్పటివరకు విద్యుత్ బిల్లులు కట్టాలని ఎం పీ ఓల ద్వారా ఒత్తిడి చేసే విధానాన్ని మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

# జగిత్యాలను ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం...



- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 14.**

మంగళవారం జగిత్యాల మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన జూలై--2026 మాసానికి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వార్డుల వారీగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన సదస్సులకు దేశ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని తెలిపారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ పార్టీలకు అతీతంగా సమిష్టిగా పనిచేస్తూ జగిత్యాలను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే జగిత్యాల పట్టణాన్ని ఆనుకుని ఉన్న చెరువులను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అమృత్ పథకం ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని, సంబంధిత కౌన్సిలర్లు తమ వార్డుల్లో ఆయా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, ాx= ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు . ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి సమిండ్ల వాణి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, జగిత్యాల పట్టణంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనతో సమగ్ర అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు. రూ. 6 కోట్ల 13 లక్షల అంచనా వ్యయంతో జగిత్యాల పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ సహకారంతో ఈ నిధులను త్వరితగతిన మంజూరు చేయించి పట్టణంలో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

చైర్‌పర్సన్ గారు ఇటీవల మున్సిపల్ కమిషనర్ గారి పేరుతో జరిగినట్లు ఆరోపణలు ఉన్న ఫోర్జరీ ఆధారిత రిజిస్ట్రేషన్ అంశంపై మాట్లాడుతూ, ఈ ఘటనను పాలకవర్గం పూర్తిగా ఖండిస్తోందని తెలిపారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ గారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఈ కేసు దర్యాప్తులో మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, తప్పుడు ప్రచారాలను ఖండించారు. దర్యాప్తులో బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులు, నూతన హౌసింగ్ కాలనీలలో రోడ్లపై గుంతలు పూడ్చడం, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జేసీబీల ద్వారా డ్రైన్లు, కాలువలను శుభ్రపరచడం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను పూర్తిస్థాయిలో ప్రజల వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. అనంతరం జాతీయ జల మిషన్ కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ సభ్యులందరూ జల ప్రతిజ్ఞ చేశారు. ప్రతి నీటిని ఒడిసి పట్టి రాష్ట్రంలోనే జగిత్యాలను ఇంకుడు గుంతల నిర్మాణంలో జగిత్యాలను అగ్రగామిగా నిలుపుదామని కమిషనర్ గారు వార్డు సభ్యులందరూ సహకరించాలని కోరారు. వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగినది ఈ సమావేశంలో కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు మరియు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు కేరళ మోడల్ విద్యార్థుల ఎంపిక

### జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన ఆరుగురు క్రీడాకారులు

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 14:**

పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-16 బాలుర విభాగంలో 1 కిలోమీటర్ పరుగుపందెంలో కె. యశ్వంత్ ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో ఎ. వైశాలి ద్వితీయ స్థానం సాధించారు. ఇదే విభాగంలో 2 కిలోమీటర్ల పరుగుపందెంలో టి. సాయి విష్ణు, పి. ఆరాధ్యలు రెండో స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-14 విభాగంలో 600 మీటర్ల పరుగుపందెంలో కె. వినూత్న ప్రథమ స్థానం, జి. చరిత ద్వితీయ స్థానం సాధించి తమ ప్రతిభను చాటారు. మొత్తం ఆరుగురు విద్యార్థులు ఈ నెల 18న మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పెద్దపల్లి అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. గట్టయ్య తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సీజ్జు ఎస్. నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్. నాయర్ అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, కిరణ్, పీటీ ఉపాధ్యాయులు అజయ్, రాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



## అడ్డు అదుపు లేకుండా అక్రమ సిట్టింగ్ రూంలు

- అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎండపల్లి వైన్స్ షాప్ ల వద్ద ఇష్టారాజ్యంగా సిట్టింగ్ లు
- జగిత్యాల - ధర్మారం రహదారిపై అవస్థలు పడుతున్న వాహనదారులు

**ఎండపల్లి, జూలై 15 (ప్రజా తీర్పు)**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్ షాప్ వద్ద ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన సిట్టింగ్ రూం ల వద్ద రహదారిపై కార్లు, ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్‌తో జగిత్యాల--ధర్మారం ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలే ఈ రోడ్డుపై రెండు, మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం కూడా సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామపంచాయతీ నుండి ఎలాంటి సిట్టింగ్ రూములకు అనుమతి ఇవ్వలేదని, అనుమతి లేకుండా నిర్వహిస్తున్న సిట్టింగ్ రూం లు, షాపులను గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేసి తొలగించే చర్యలు చేపడతామని తెలిపారు. సిట్టింగ్ రూముల ముందు రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు నిలపడంతో రోడ్డు ప్రమాదాలు సంబంవించే అవకాశం ఉందని, ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు స్పందించి ఎండపల్లి మండల వైన్స్ షాపుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ సిట్టింగ్ రూం లు, రహదారిపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి

- జక్కిడి శివచరణ్ రెడ్డిని సస్పెండ్ చేయాలని అఖిలపక్ష నేతల డిమాండ్

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 14:**

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి (ప్రభాకర్ రెడ్డి) బీసీ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్‌తో పాటు గౌడ్ సామాజిక వర్గంపై చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను టీఆర్పీ, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), బీసీవై నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆయనపై పార్టీ పరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లిలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో టీఆర్పీ నాయకుడు గుండావేణ స్వామి, బీఎస్పీ నాయకుడు సాతూరి అనిల్, బీసీవై నాయకుడు అట్ల రమేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తమ పార్టీ మహిళా నాయకురాలిపై జరిగిన వ్యాఖ్యల విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. గతంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అవమానానికి గురైన సందర్భంలోనూ, ఇప్పుడు కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్‌తో పాటు గౌడ్ సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జక్కిడి శివచరణ్ రెడ్డిపై కూడా చర్యలు తీసుకోకపోవడం బహుజన వర్గాలను అవమానపరిచినట్లేనని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ వెంటనే జోక్యం చేసుకుని జక్కిడి శివచరణ్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకుడు పల్లె సుమన్, బీసీవై నాయకుడు అట్ల రమేష్ యాదవ్, టీఆర్పీ నాయకుడు పోలుదాసరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ లైన్‌మెన్‌ల సమస్యపై చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం

**కురవి జులై 14 (ప్రజా తీర్పు విలేఖరి):**

డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా ఏజెన్సీలు మరియు కాంట్రాక్టు ఉద్యోగుల డేటా సేకరణ,వెరిఫికేషన్ ఆడిట్ కార్యక్రమం సందర్భంగా మిషన్ భగీరథ పాలేరు గ్రిడ్ సెగ్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు,జిల్లా ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు కలిసి ఆడిట్‌కు వచ్చిన చీఫ్ సెక్రటరీ (సీఎస్) కి వినతి పత్రాన్ని అందజేశారు. గత అనేక సంవత్సరాలుగా లైన్‌మెన్ హోదాలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ప్రభుత్వ రికార్డుల్లో హెల్పర్గా నమోదు చేయడం అన్యాయమని,వెంటనే ఈ నిర్ణయాన్ని సవరించి వారి అసలు హోదా అయిన లైన్‌మెన్గానే నమోదు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన చీఫ్ సెక్రటరి సమస్యను పరిశీలించి, సంబంధిత అంశాన్ని నోటీసు తీసుకుని పూర్తి నివేదికను పై అధికారులకు పంపిస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించడంతో కార్మికులు తమ సమస్యకు న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

## పలువురు మంత్రులను కలిసిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు

**(నారుకట్ల మదు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 14**



వేములవాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారిని, మైనార్టీ సంక్షేమ ఢ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి అజారుద్దీన్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో ఆరోగ్య సేవల బలోపేతం, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలు వంటి అంశాలను మంత్రుల దృష్టికి విప్ గారు తీసుకెళ్లారు..



## తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు స్కూల్ బ్యాగుల పంపిణీ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 14**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పిల్లలకు స్కూల్ బ్యాగులు పంపిణీ నాతరి స్వామి టీపీసీసీ రాష్ట్ర క్యాంపెయిన్ ప్రచార కమిటీ కన్వీనర్ సహకారంతో సుభాష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 50 మందికి స్కూల్ పిల్లలకు బ్యాగులు ఇతర వస్తువులు అందివ్వడం అయినది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు వచ్చేసి పిల్లలకు స్కూలు బ్యాగులు ఇతర వస్తువు అందివ్వడం అయినది స్కూల్ హెడ్మాస్టర్ సంతోషి రాణి తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రంగ రామన్న, రత్నం రాజన్న ,గెల్లీ జయరాం యాదవ్, సుదగొని నాగేందర్ గౌడ్, ఏనుగు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియను వేగవంతం చేయాలి

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా) జూలై 14**



ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో భాగంగా పూరించిన ఫారాలను తీసుకోవడం, డిజిటలైజ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని, ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవగాహన కల్పించడం బిఎల్ఓ ల బాధ్యతని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళ వారం ఉప్పల్ లోని 375, 376 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటుచేసిన ఎన్యూమేరషన్స్ సెంటర్లలో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫారాల ప్రక్రియను వేగవంతం చేయాలని, స్వీకరించిన ఫారాలను వెంటవెంటనే డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బి ఎల్ వో లదేనని స్పష్టం చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బి ఎల్ వో లు ఓటర్లకు సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ ఏఈఆర్వోలు, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

## ఆషాడ అమావాస్య సందర్భంగా సాయి భోజన్

- గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం
- బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమం
- బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 14**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి దానధర్మాలకు, పితృ తర్పణాలకు,పవిత్రమైనదిగా భావించే ఆషాఢ అమావాస్యను పురస్కరించుకొని బెల్లంపల్లి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ రాజేశ్వరిల సహకారంతో గర్భిణులకు, బాలింతలకు, డయాలసిస్ రోగులకు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్ -రాజేశ్వరి తెలిపారు . ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, డయాలసిస్ పేషెంట్లు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయి భోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



### ఆదరిద్దాం.. అన్నదానం చేద్దాం

ట్రస్ట్ ద్వారా ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం-అన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమములో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులు, జేరిపోతుల చంద్రకళ సేవకులు పోతురాజుల తిరుపతి, దార ప్రసాద్, వేల్పుల నాగేష్ సంతోష్, కొమ్ము మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. బాయిజమ్మసాయి సేవా ట్రస్ట్ ద్వారా అన్నదానం, సాయం అందించాలని అనుకునేవారు ట్రస్ట్ మేనేజర్ 8106550532, ఫౌండర్స్ 9959269975, 9949041595 సంప్రదించాలని తెలిపారు.

# అనారోగ్య మరణాలన్నీ రాంకీ చెత్తడంపింగ్ యార్డ్ ద్వారా జరిగిన హత్యలే

(వినోద్, ప్రజా తీర్పు, జవహర్ నగర్, మేడ్చల్ జిల్లా) జులై 14



జవహర్ నగర్ , అహ్మద్ గూడ 2 బి ఎచ్ కె, ఆర్జీకాలనీ,దమ్మాయిగూడ, బండ్లగూడ, యాప్రాల్, శామీర్ పేట, కీసర, కాప్రా, ఘట్ కేసర్, తదితర ప్రాంతాల్లో అనారోగ్యంతో చనిపోయిన ప్రజల మరణాలన్నీ జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యాజమాన్యం ద్వారా జరిగిన హత్యలేనని సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మరియు కమిటీ కో కన్వీనర్ గడ్డం సదానందం పేర్కొన్నారు. 2026, జూలై-14, మంగళవారం రోజు, కో కన్వీనర్, టియుసిఐ వి.ప్రవీణ్ అధ్యక్షతన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి ఆధ్వర్యంలో ప్రగతినగర్, బీజేఆర్ నగర్ ప్రాంతాల్లో నాలుగవరోజు పాదయాత్ర కొనసాగింది. గత 25 సంవత్సరాలుగా జరుగుతున్న అసహజ, అనారోగ్య మరణాలు భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు భంగకరమని ఉద్ఘాటించారు. కొంతమంది వివిధ శాఖలలోని అవినీతి ప్రభుత్వ అధికారులు, మంత్రుల ప్రోదల్బంతో రాంకీ యాజమాన్యం, ఇక్కడి ప్రజల జీవితాలతో చెలగాట మాడుతున్నదని సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్ట రమా, గడ్డం సదానందం మరియు సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జి.ఝాన్సీ ఆగ్రహించారు. ఇక్కడి బాధిత ప్రాంతాల ప్రజలను ఓటు బాంకు రాజకీయాలకు పరిమితం చేసి, వారి ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణ, జీవన మనుగడను విస్మరించిందని ఆరోపించారు. స్థానిక ఎంపి, ఎమ్మెల్యే, అధికారపార్టీ నాయకులు డంపింగ్ యార్డుకు ఎత్తివేతకు సుముఖంగా ఉన్నప్పుడు, ప్రశ్నించి, ఉద్యమించే శక్తులను ప్రభుత్వం, పోలీసులు తీవ్ర నిర్భంధ అణిచివేత చర్యలు ఎందుకు చేపట్టడుతుందో? అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తి విఘాత, దుర్మార్గ, అమానుష అప్రజాస్వామి చర్యలకు వ్యతిరేకంగా జూలై-26 న చేపట్టిన డంపింగ్ యార్డు సమస్యపై చేపట్టే బారీ సదస్సును జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పెద్దలు, ప్రపంచంలోనే తీవ్ర అనారోగ్య అతిపెద్ద కేంద్రంగా 4 వ ప్రాంతంగా జవహర్ నగర్ ప్రాంతం ఉన్నదనే విషయాన్ని గుర్తించి, వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈపై కార్యక్రమంలో చైర్మన్ షేక్ షావలి, గౌరవ సలహదారుడు, మాజీ ఉపసర్పంచ్ ఆర్. నర్సింహ్మా గౌడ్, కోశాధికారి పి.శివబాబు, సిపిఐ(ఎం.ఎల్) ఎం.హన్మేష్, కో కన్వీనర్స్ శాంతినగర్ ఎ.సుబ్రమణ్యం, సిపిఐ టి.శంకర్, సిపిఎం శివన్నారాయణ, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, తెలంగాణ జేఏసీ ఆంజినేయులు, మాజీ కార్పొరేటర్ పల్లపురవి, బహుజనసత్త సింగరయ్యగౌడ్, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్కసునీత, పిడిఎం చంద్రమౌళి, సిఎంఎస్ జయ, కమిటీ సభ్యులు పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీబాయ్, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటేష్, ఎమ్మార్పీఎస్ వడ్డెపల్లి శివ, టివిఐవి మబ్బుబాలు, అంబాల ఎల్లయ్య, ఎం.డీ.హైమద్, వి.రవి, సురేందర్, పిఓడబ్ల్యూ జయసుధ, ఫాతిమా, బీఆర్ఎస్ ఎ.దుర్గేష్, సిపిఐ దర్శనం యాదగిరి, ఆటో యునియన్ రాంరెడ్డి

తదితరులు ఈపై కార్యక్రమంలో పాల్గొన్నారు.



## రూ.2 లక్షల లంచంతో ఏసీబీకి చిక్కిన మున్సిపల్ ఏఈ

- ఇంట్లో సోదాల్లో రూ.32.31 లక్షల నగదు స్వాధీనం
- పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అవినీతి బాగోతం బట్టబయలు

(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 14:

పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కల్లేపల్లి సతీష్ కుమార్ మంగళవారం తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా అధికారులు పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం ఆయన నివాసంలో నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32.31 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. తెనుగువాడ హిందూ శ్మశానవాటిక, కూనారం రోడ్డులోని శ్మశానవాటిక అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1.22 కోట్ల తుది బిల్లును హైదరాబాద్‌లోని పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు (టీయూఎఫ్ఐడీసీ) పంపించేందుకు అధికారిక అనుకూలం కల్పించాలంటే రూ.2 లక్షల లంచం ఇవ్వాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను అసిస్టెంట్ ఇంజనీర్ డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలో సతీష్ కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.2 లక్షల లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడి నివాసంలో నిర్వహించిన సోదాల్లో ఆదాయానికి మించి ఉన్నట్లు భావిస్తున్న రూ.32,31,900 నగదు లభ్యమైంది. ఈ మొత్తాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.



## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన రైతు నేస్తం కార్యక్రమం

రామడుగు, జూలై 14 (ప్రజాతీర్పు ప్రతినిధి)

రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంతో పాటు కంటింజెన్సీ ప్లాన్ (ఆకస్మిక ప్రణాళిక)పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ప్రభావతి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని రైతులకు వివరించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశమున్నందున భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు కంది, పెసర, మినుము వంటి పప్పుధాన్య పంటలను ఆగస్టు వరకు సాగు చేయాలని సూచించారు. అలాగే నువ్వులు, జొన్నలు, సజ్జలు వంటి తక్కువ నీటి అవసరమున్న నూనెగింజలు, చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. నీటిని వృథా చేయకుండా సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని, బోరుబావుల ఆధారంగా వరి సాగును వీలైనంత వరకు నివారించాలని సూచించారు. లేకపోతే పంట మధ్యలో నీటి ఎద్దడి ఏర్పడి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రావుపేట సర్పంచ్ ఎడవెల్లి వనజ నరేందర్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అనంతరాజ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మాసాయిపేట్ మండల కేంద్రంలో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య

- భార్యాభర్తల మధ్య విడాకుల గొడవడం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

( వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) జూలై 14



మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో బంగారమ్మ ఆలయం సమీపంలో పోల్ నెంబర్ 564/7 వద్ద రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం భార్యాభర్తల మధ్య విడాకుల విషయంలో మనస్థాపాన్ని గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం తిమ్మక్క పల్లి గ్రామానికి చెందిన మిక్కిలి భాస్కర్ రెడ్డి వయసు 33 సంవత్సరాలుగా గుర్తించారు గత కొన్ని రోజులుగా మనోహరాబాద్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## స్కూల్ కు భూమిని కేటాయించి, డంపింగ్‌ను యార్డు ఎత్తివేయండి.

- జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ మరియు గబ్బిలాలపేట స్కూల్ సాధన కమిటీ సభ్యులు షేక్ షావలి

(వినోద్, ప్రజా తీర్పు, జవహర్ నగర్, మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జులై 14



జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల పలు కాలనీలలో ప్రజా సమస్యలను తెలుసుకొని, వారిక విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించెందుకు ప్రజాభిప్రాయ సేకరణ జరపడానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్ తోపాటు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐఏఎస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ముందుగా రాంకీ చెత్త డంపింగ్ యార్డును తొలగిస్తే తప్ప, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడవని జవహర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ మరియు గబ్బిలాల పేట స్కూల్ సాదన కమిటి సభ్యులు షేక్ షావలి పంపిన పత్రిక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన సామాన్య పేదపిల్లలకు విద్యను అందుబాటులో ఉంచడానికి హాస్టళ్లు, బడులు ఏర్పాటు చేస్తామని వైయస్ఆర్ నగర్ బాలాజీనగర్, సుక్కమ్మ బస్తీకి పరిశీలనకు విచ్చేసిన రంజన్ జవహర్ నగర్ ప్రాంతంలో ఉన్న సుమారు 100 బస్తీల యొక్క సమస్య యొక్క తీవ్రతను అర్థం చేసుకోలేక పోతున్నారని అన్నారు. సంభందిత జిల్లా విద్యాశాఖ అదికారులు తప్పుడు సమాచారం అందజేసి, ఇక్కడి ప్రజలను వంచించి, మోసగిస్తున్నారని మండిపడ్డారు. గబ్బిలాల పేట స్కూల్ సాధన కమిటీ ఆద్వర్యంలో గత రెండు నెలలుగా గబ్బిలాల పేట ప్రాంత పిల్లలకు అందుబాటులో స్కూలును కేటాయించాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న విషయం అధికారులకు తెలిసికూడ రంజన్ ని తప్పుదోవ పట్టిస్తున్నారని, భూమిని కేటాయించకుండా, స్కూల్ ఏర్పాటు చేయబోతున్నట్లు తప్పుడు సమాచారం ఇవ్వడం వెనుక, జిల్లా అధికారులు ఎవరి ప్రయోజనాలకు పాటుపడుతున్నారో అర్థం అవుతుందని అన్నారు. కబ్జా అయిన స్థలాన్ని పరిరక్షించాలని కోరితే, ఎవరు కబ్జా చేశారో చెప్పాలని, అడిగిన వారనే అడగడం విడ్డూరంగా ఉందని గుర్తుచేశారు. అప్పటి జిల్లా కలేక్టర్ స్థలాన్ని కేటాయిస్తే, అది తమదేనని తప్పుడు డ్యాక్యుమెంట్లతో కోర్టుకు వెళ్ళినవారిని విస్మరించి, ప్రశ్నించిన వారిపైనే, ఎదురు ప్రశ్నలు వేయడం జిల్లా విద్యాశాఖ అదికారులకే చెల్లిందని అన్నారు. ఇప్పటికైన రంజన్ వెంటనే స్పందించి, కోర్టు వివాదంలో ఉన్న భూమికి బదులు, ఖాళీగా ఉన్న, వివాదాలు లేని ప్రభుత్వ భూమిని కేటాయించి, ఇక్కడి ప్రాంత ప్రజల పిల్లలకు వసతులతో కూడిన స్కూల్ భవనంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలకంగా వ్యవహారించే భావి భారతపౌరులైన పిల్లలు ఆరోగ్యవంతమైన విద్యా ప్రమాణాలు అందుకోవడానికి డంపింగ్ యార్డు యొక్క ప్రమాద తీవ్రతను ప్రభుత్వ ద్రుష్టికి తీసుకెళ్ళి, ఎత్తివేసే అవసరాన్ని గుర్తుచేయాలని ఈ సందర్భంగా షేక్ షావలి డిమాండ్ చేశారు.



## డిసిసి కార్యవర్గంలో కార్యదర్శిగా ఎన్నికైన దిలీప్ కు ఘనంగా సన్మానం

( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై 14

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యవర్గంలో కార్యదర్శిగా ఎన్నికైన దిలీప్ కు ఘనంగా సన్మానం సీనియారిటీకి దక్కిన గౌరవం గొల్లపెల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అడ్వకేట్ చిర్ర దిలీప్ కు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రా పల్లె గంగన్న, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చిలువకోడూరు సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్,ప్రధాన కార్యదర్శి రంగ దాముని పల్లె సర్పంచ్ జెల్ల అఖిల అనిల్ కుమార్ బొంకూర్ గ్రామ సర్పంచ్ ములకల శిరీష శ్రీనివాస్,దట్నూర్ సర్పంచ్ బెక్కం గంగారం,వారికీ ఘనంగా సన్మానించడం జరిగింది వారికి శుభాకాంక్షలు తెలిపి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అందరూ కోరుకుని అభినందించారు చిర దిలీప్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో కార్యదర్శిగా నన్ను నియామకం చేసినందుకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య గారికి రాష్ట్ర మంత్రివర్యులు ధర్మపురి శాసనసభ్యులు లక్ష్మణ్ కుమార్ అన్న గారికి కృతజ్ఞతలు తెలియజేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గొల్లపెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్ట లక్ష్మణరావు, చెవులమద్ది మల్లేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌతమ్ రాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజంగి సత్తయ్య, నక్క విజయ్,రమేష్ రెడ్డి, కోటశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## 26 వార్డు ఓటర్ ఎన్యూమరేషన్ సెంటర్ సందర్శించిన ఆర్డీవో ఉమారాణి

26 వార్డు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్.

నర్సంపేట జూలై 14 ప్రజా తీర్పు

నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 26 వార్డులో 148,149 బూత్ ల లో నిర్వహిస్తున్న ఓటర్ ఎన్యూమరేషన్ సెంటర్ ని ఆర్డీవో ఉమారాణి, 26 వార్డు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ సందర్శించడం జరిగింది. అనంతరం ఆర్డీవో ఉమారాణి మాట్లాడుతూ ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు మరియు తొలగింపులకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. 148,149 పోలింగ్ స్టేషన్ ల లో బిఎల్ఓ లు మరియు బిఎల్ఎలు సర్ ప్రక్రియ ఆధ్వర్యంలో ఈ ఓటరు సవరణ నమోదు కార్యక్రమాన్ని బాగా నిర్వహిస్తున్నారని అన్నారు. వార్డులోని ప్రజలకు ఓటరు నమోదు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో ఉండే విధంగా చూడాలని అవసరమైన దరఖాస్తు ఫారాలను క్షేత్రస్థాయిలోనే నింపించి, ప్రజలకు పూర్తి సహకారాన్ని అందించాలని అన్నారు జాబితాలో పేరు లేని వారు, చిరునామా మార్పు, వివరాల సవరణ వినియోగించుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ యూసుఫ్ బి ఎల్ ఓ. ఎన్. అనురాధ, ఏ. చైతన్య . బి ఎల్ ఏ. సంఘపు శ్రీధర్, గుండెబోయిన శివ కోటి, అల్లంనేని ప్రకాష్ రావు లు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు

# కలాన్ని నమ్ముకున్న జర్నలిస్టుకు కన్నీళ్లే మిగిలాయా?

- గజ్జెల శ్రీనివాస్ విషాదం.. క్షేత్రస్థాయి పాత్రికేయుల భద్రతపై ప్రశ్నలు

(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జులై 14



ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడం, అన్యాయంపై గొంతెత్తడం వంటి బాధ్యతలను మోస్తున్న పాత్రికేయుల జీవిత భద్రత మాత్రం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు సమాజంలో గౌరవం, విశ్వసనీయత పొందిన ఈ వృత్తి నేడు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే క్షేత్రస్థాయి జర్నలిస్టులు అవసర సమయంలో ఒంటరిగా మిగిలిపోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ నాయకుల ఎదుగుదలలో, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం. ఒక నాయకుడి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కూడా మీడియానే. కానీ అదే జర్నలిస్టు కష్టాల్లో ఉన్నప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు లేదా మరణించినప్పుడు అండగా నిలిచే వ్యవస్థ బలహీనంగా ఉండటం బాధాకరం. కేవలం రాజకీయ నాయకులే కాదు, మీడియా సంస్థల బాధ్యత కూడా ఈ సందర్భంలో చర్చకు వస్తోంది. క్షేత్రస్థాయిలో ఎండా వానా లెక్కచేయకుండా వార్తల కోసం తిరిగే జర్నలిస్టులకు అనేక సంస్థలు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ భరోసా కల్పించలేకపోతున్నాయి. ఒక జర్నలిస్టు ఆకస్మికంగా మరణిస్తే అతని కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది. ఇలాంటి పరిస్థితులకు అద్దం పట్టే ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయుడు లిగజ్జెల శ్రీనివాస్‌లి మరణం. గత పదేళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన శ్రీనివాస్.. సామాన్య ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో తన వంతు పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఆయన ఆకస్మిక మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో ఉన్న ఆ కుటుంబం ఇప్పుడు భవిష్యత్తుపై ఆందోళనలో ఉంది. సమాజం కోసం పనిచేసిన ఒక జర్నలిస్టు కుటుంబం ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది. గజ్జెల శ్రీనివాస్ ఘటన ఒక్క కుటుంబానికి సంబంధించిన విషాదం మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది క్షేత్రస్థాయి జర్నలిస్టుల జీవిత భద్రతపై ఒక ప్రశ్న. జర్నలిస్టులను కేవలం వార్తలు అందించే వ్యక్తులుగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు కలిసి వారి కుటుంబాల భద్రతకు స్పష్టమైన విధానాలను రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది. అలాగే జర్నలిస్టులు కూడా వృత్తిపరమైన భేదాలను పక్కనపెట్టి, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. గజ్జెల శ్రీనివాస్ కుటుంబానికి సానుభూతి మాత్రమే కాదు.. భవిష్యత్తుకు భరోసా అవసరం. ఒక జర్నలిస్టు కుటుంబం రేపటి రోజున అనాథగా మారకుండా ఉండేందుకు సమాజం, ప్రభుత్వం, మీడియా వ్యవస్థ కలిసి బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే... ప్రజల కోసం కలం పట్టే చేతులకు భద్రత లేకపోతే, ప్రజల గొంతుకను వినిపించే స్వరాలు క్రమంగా నిశ్శబ్దమయ్యే ప్రమాదం ఉంది.

**- వొడ్యాల వేణు**

సీనియర్ పాత్రికేయుడు



## మాసాయిపేట మండలంలోనీ పోతనపల్లి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**( వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) జులై 14.**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండలం పోతాన్ పల్లి గ్రామంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు సహకారంతో మాసాయిపేట మండల అధ్యక్షుడు మొలుగు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అరికెల సత్తయ్య 48000 వేలు మరియు అరికెల మంజుల 21,000వేలు సీఎం రిలీఫ్ చెక్కులు అందించడం జరిగింది సిఎం సహాయనిది అనారోగ్యం పాలై ఆసుపత్రి లో చేరి చాలా డబ్బులు ఖర్చు పెట్టుకున్న వారికి సీఎం సహాయనిది ఎంతో కొంత సహాయపడుతుందని అలాగే ఎంపీ రఘునందన్ రావు గారి చొరవతో తొందరగా చెక్కులు వస్తున్నాయని మొలుగు నాగేందర్ రెడ్డి గారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొలుగు నాగేందర్ రెడ్డి, గారు మండల ప్రధాన కార్యదర్శి ఏశం నవీన్ యాదవ్, ఉపాధ్యక్షులు కోటేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు తలారి మల్లేష్, బూత్ అధ్యక్షులు నరేష్, శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## మట్టి తవ్వకాలను అరికట్టండి

- రాజకీయ అండతో కొనసాగుతున్న తవ్వకాలు
- చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ కు వినతి పత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

**(రవీందర్, ప్రజా తీర్పు సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్) రిపోర్టర్ జులై 14**

రాజకీయ అండతో హుస్నాబాద్ పట్టణ శివారు మహమ్మదాపూర్ రోడ్డులో ఉన్న కుమ్మరి కుంటలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు ఐలేని మల్లికార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ కె. శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 81లో ఉన్న కుమ్మరి కుంట విస్తీర్ణం 1 ఎకరం 12 గుంటలు ఉండగా ఇందులో కొంతభాగం ఆక్రమణలకు గురైనట్లు కనిపిస్తోందన్నారు. సంబంధిత అధికారులు కుంటకు హద్దులు నిర్ణయించి, ఆక్రమణకు గురైన భూమిని గుర్తించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని కుంటలకు కూడా సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణల నుండి కాపాడాలని కోరారు. అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు లేకుండా ఇసుక రవాణా జరుగుతోందని, అక్రమంగా తరలిస్తున్న ఇసుకను స్వాధీనం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాజకీయ అండతో అక్రమ మట్టి, ఇసుక తవ్వకాలను జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ నాయకులు కూతాటి భాస్కర్, గుగులోతు తిరుపతి నాయక్, జేరిపోతుల రమేష్, కొనేటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

## వైష్ణో దేవికి రూ.550 కోట్ల నకిలీ వెండి కానుకలు!

- దర్యాప్తులో పోలీసుల జాప్యం
- వివరణ ఇవ్వాలని కోర్ట్ ఆదేశం


జమ్ము కశ్మీర్‌లోని త్రికూట పర్వతాలపై ఉన్న శ్రీ మాత వైష్ణో దేవి గుడికి సుమారు రూ.550 కోట్ల విలువైన నకిలీ వెండి కానుకలు అందాయన్న ఆరోపణలపై విచారణకు హాజరు కావాలని క్రైమ్ బ్రాంచ్ విచారణ అధికారిని జమ్ము కోర్టు ఒకటి సోమవారం ఆదేశించింది. అడ్వొకేట్ దీపక్ శర్మ పిటిషన్‌పై స్పందిస్తూ కోర్ట్ ఈ నిర్ణయం తీసుకుంది. నకిలీ కానుకల విషయమై తాను ఈ సంవత్సరం మే 9న క్రైమ్ ఐజీపీకి, ఎస్ఎస్‌పీకి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని కోరానని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. అయితే తన ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. కీలక సాక్ష్యాధారాల పరిరక్షణకు తీసుకొన్న చర్యల గురించి పోలీసులు స్టేటస్ రిపోర్ట్‌లో పేర్కొనలేదని వాదించారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ విజయవంతం

**(రవీందర్, ప్రజాతీర్పు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్) జులై 14**



పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఏబీవీపీ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలల బంద్ విజయవంతమైందని ఏబీవీపీ విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. కాగా స్థానిక ప్రభుత్వ జూనియర్, మోడల్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తరగతులను బహిష్కరించి బంద్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్ మెంట్ , స్కాలర్షిప్ లపై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయని కారణంగా రూ.11,000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏటా రెండు లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, 4.5 మంది సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని దీంతో ఇక్కడి విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలస వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు, గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని, మా ప్రభుత్వంలో బకాయిలు చెల్లించడంతో పాటుగా, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు. ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, బడ్జెట్ కాలేజిలు సైతం మూతపడుతున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్స్ అనేవి విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం వేసే బిక్ష కాదన్నారు. రీయింబర్స్ మెంట్ కోసం అడిగితే విద్యార్థులపై ఉక్కుపాదం మోపుతున్నారని, నిరసన చేస్తే లాఠీచార్జీలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కానీ తెలంగాణ విద్యార్థులకు ఇవి కొత్తేమీ కాదన్నారు. రేవంత్ రెడ్డి మాట తప్పారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంకురార్పణ చేస్తామని, అన్ని కళాశాల ప్రాంగణాలు, విశ్వవిద్యాలయాలు మరోసారి ఉద్యమ వేదికలై కాంగ్రెస్ పార్టీకి మరణశాసనం రాస్తాయన్నారు. పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తూ రాక్షసానందం పొందుతున్న రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మార్చుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్ . జిల్లా ఎస్ ఎఫ్ డి కన్వీనర్ చరణ్. నగరఉపాధ్యక్షులు సంతోష్. అంజి. నగర సంయుక్త కార్యదర్శి రంజిత్. మహిళా కన్వీనర్ శిరీష మహిళా కో కన్వీనర్ అశ్విని మిషన్ సాహసి కో కన్వీనర్ ప్రసన్న . శరత్. కుమార్ .శ్రావణ్. రామ్ చరణ్ .పూర్ణచందర్ .తదితరులు పాల్గొన్నారు.




## ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసిన సీతారామ సేవా సదన్

**మంథని, జూలై-14 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలోని సీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు మంగళవారం ఉపకార వేతనాలు, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటుగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతారామ సేవా సదన్ అధ్యక్షుడు హరిబాబు, సీనియర్ న్యాయవాది రఘోత్తం రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గట్టు గంగాధర్ మాట్లాడుతూ, సమాజ సేవే లక్ష్యంగా సీతారామ సేవా సదన్ విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిపై కొంతమంది తల్లిదండ్రులు ఇప్పటికీ అపోహలతో చిన్నచూపు చూస్తుండటం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ విద్యా ప్రమాణాలను పెంచేందుకు అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, సందేహాలను నివృత్తి చేసుకుంటూ నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు చురుకుగా పాల్గొన్నప్పుడే ఉపాధ్యాయులు కూడా మరింత సమర్థవంతంగా బోధించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి నేడు అనేక మంది ఉన్నత పదవుల్లో సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరగాలంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ జీతాలు పొందుతూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడం సమాజానికి సరైన సందేశం కాదని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సీతారామ సేవా సదన్ ప్రతినిధులు తెలిపారు. తమ పిల్లలను ప్రోత్సహించడానికి ఉపకార వేతనాలు పంపిణీతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు. ఈ క్రమంలో గుంజపడుగు గ్రామానికి చెందిన ఎండీ. రయాన్ కు ఉపకార వేతనం అందజేయడంతో విద్యార్థి తండ్రి ఎండీ. జాఫర్ సేవా సదన్ కు, నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొల్లారపు శ్రీనివాస్, శ్రీరాంభట్ల అంబరీష్, అష్టదని గంగాధర్, లోకే మనోహర్, దుద్దిళ్ళ గణపతి, సేవా సదన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## నమస్తే పథకం ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీపీఈ కిట్ల పంపిణీ

**(రవీందర్, ప్రజాతీర్పు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్) జులై 14**

హుస్నాబాద్ పట్టణంలో పురపాలక సంఘ చైర్ పర్సన్ దండి లక్ష్మి ,కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో నమస్తే పథకం కింద చెత్త సేకరణ చేసే కార్మికులకు మంగళవారం ఆయుష్మాన్ భారత్ కార్డులు మరియు పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న నమస్తే ( నేషనల్ యాక్షన్ ఆఫ్ మెకానైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం ) పథకం ద్వారా పారిశుద్ధ్య కార్మికులు మరియు వ్యర్థాల సేకరణ కార్మికుల ఆరోగ్య భద్రత, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనం మరియు వృత్తి పరమైన రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యం. ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే ఆరోగ్య బీమా సేవలను పొందే అవకాశం కలుగుతుంది. అలాగే పంపిణీ చేసిన పీపీఈ కిట్లు వ్యర్థాల సేకరణ సమయంలో కార్మికులు తమ ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ మరియు పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ... పట్టణ పరిశుభ్రత పరిరక్షణలో వ్యర్థాల సేకరణ కార్మికుల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. వారి ఆరోగ్యం, భద్రత మరియు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం మున్సిపాలిటీ బాధ్యతగా కొనసాగుతుందని తెలిపారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు మరియు వ్యర్థాల సేకరణ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్స్ బూరుగు లత,పిల్లి తిరుపతి, పూదరి వరప్రసాద్ , కేశవేని రమేష్ ,బొల్లి శ్రీనివాస్ , గాదేపాక రవీందర్, వాల సుప్రజ ,స్వరూప , కోఆప్షన్ సభ్యులు హసన్ ,సరోజన , మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, డిబీఆర్ఓ సిబ్బంది రాజు,జవాన్ ప్రభాకర్, శ్రీకాంత్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.




## మంథని చంద్రశేఖర్‌కు మహానంది అవార్డు ప్రదానం

**మంథని, జూలై-14 (ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలోని అంబేడ్కర్ నగర్ మూడో వార్డుకు చెందిన ప్రిన్సి మ్యారేజ్ బ్యూరో అధినేత మంథని చంద్రశేఖర్‌కు మహానంది అవార్డు ప్రదానం చేశారు. తెలంగాణ తొలి మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జై తెలంగాణ ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. సమాజంలో మ్యారేజ్ బ్యూరో సేవల ద్వారా విశేష కృషి చేస్తున్నందుకు ఆయనకు ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు అందుకున్న చంద్రశేఖర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ గౌరవానికి ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత బాధ్యతతో సేవలు అందిస్తానని పేర్కొన్నారు.

# సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాడవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు




- సూర్యాపేట పాత బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు.

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 14**

సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాడవెందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్: ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ మరియు వాహన పత్రాలను కలిగి ఉండాలి. మద్యం సేవించి వాహనం నడపరాదు: మద్యం మత్తులో ఆటోలు నడపడం వల్ల అమాయక ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్ నియమాలు: జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సిగ్నల్ జంపింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులు: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని ఎస్ఐ తెలిపినారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

- ఆసుపత్రిడెవలప్‌మెంట్ సొసైటీ తొలి సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 14**



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డెవలప్‌మెంట్ సొసైటీ తొలి సమావేశం మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. సొసైటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ఆసుపత్రిడెవలప్‌మెంట్ సొసైటీ నిధుల ఆదాయం--వ్యయం, ఆసుపత్రిలో ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్సలు, ఓపీ సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులతో వ్యవహరించే విధానం, భవిష్యత్ అవసరాలపై సభ్యులకు అధికారులు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల సంఖ్య, అత్యవసర వైద్య సేవలు, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవలు, మందుల లభ్యత, శస్త్రచికిత్సల నిర్వహణ, వైద్య పరికరాల అందుబాటు, ఆసుపత్రి పరిశుభ్రత, మౌలిక వసతులు, సిబ్బంది అవసరాలు, ఆసుపత్రిడెవలప్‌మెంట్ సొసైటీ నిధుల వినియోగంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి పరిపాలనపై నిరంతర నిఘా ఉండాలని సూచించిన కలెక్టర్, ఓపీ, ఇన్‌పేషెంట్, బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, టీబీ సేవల పనితీరును సమీక్షించారు. ఆసుపత్రికి అవసరమైన అత్యవసర మందులు, శస్త్రచికిత్సలకు అవసరమైన ఇంప్లాంట్లు, వినియోగ వస్తువులు, ల్యాబ్ రియాజెంట్లు, ఇతర వైద్య సామగ్రి ఎలాంటి కొరత లేకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డయాగ్నస్టిక్ సెంటర్‌లో నిర్వహించే అన్ని పరీక్షలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, ఖచ్చితత్వంతో నిర్వహించి, పరీక్షల నివేదికలను రోగులకు ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో అందించాలని సూచించారు. రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఫర్నిచర్, కుర్చీలు, టేబుళ్లు, వైద్య పరికరాలను ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా కొనుగోలు చేసుకోవాలని, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ విభాగం కింద పూర్తి స్థాయిలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నిధుల వినియోగానికి తుది ఆమోదం పొందాలని, ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు, మరమ్మతులు, నిర్వహణ, వార్డుల అభివృద్ధి, సివిల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య వసతులు, రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, నిబంధనలకు అనుగుణంగా ఆసుపత్రిడెవలప్‌మెంట్ సొసైటీ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని ప్రతి సంవత్సరం ఖర్చు నిధులకు ఆడిట్ చేయించాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కొంతమంది సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో హాజరు నమోదు చేసి విధి నిర్వహణ స్థలం విడిచి వెళ్తున్నట్లు సమాచారం ఉందని, అటువంటి వారిపై నిఘా ఉంచి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై మరింత విశ్వాసం పెరిగేలా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా, సానుభూతితో వ్యవహరిస్తూ వారి ఆరోగ్య సమస్యలను ఓపికగా విని నాణ్యమైన వైద్య సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందించాలని మరియు ముఖ్యముగా ఓపీ విభాగానికి వచ్చే రోగులు ఎండ, వర్షాల బారిన పడకుండా వారి సౌకర్యార్థం ఓపీ ముందు రేకులు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో ఆమోదించిన అభివృద్ధి పనులు, కొనుగోళ్లు, ఇతర నిర్ణయాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, తదుపరి సమావేశంలో పురోగతి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి ఓపి సేవలో ఎలాంటి అంతరాయం కలుగకుండా మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని అన్నారు. చివరిగా హాస్పటల్ సూపర్డెంట్ పి. శ్రావణ్ మాట్లాడుతూ సమావేశంలో జిల్లా కలెక్టర్ చేసిన సూచనలు, ఆదేశాల మేరకు ఆమోదించిన అన్ని అభివృద్ధి పనులు, కొనుగోళ్లు, ఇతర నిర్ణయాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, సూచించిన ప్రతి అంశాన్ని కచ్చితంగా అమలు చేసి, తదుపరి సమావేశంలో పురోగతి నివేదిక సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డా. ఎం. రామాదేవి, డీఎంఈ (అకాడమిక్), హైదరాబాద్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పి. వెంకటరమణ, డా. బి. జనార్ధన్ డా. ఎస్. గీతావాణి, డా. ఎస్. వెంకటేశ్వర్లు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ ఆసుపత్రిసర్వీసెస్, సభ్య కార్యదర్శి) పి. శారద, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, ఆసుపత్రిడెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు, వైద్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గెలుపు బాటలోకి.. తొలి వన్డేలో భారత్ విజయం

## అక్షర్ ఆల్‌రౌండ్ షో

## గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్




వరుసగా రెండు టీ20 సిరీస్ ఓటముల నైరాశ్యంలో ఉన్న భారత క్రికెట్ జట్టును వన్డే ఫార్మాట్ మళ్లీ విజయాల బాట పట్టించింది. ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా మంగళవారం బర్మింగ్‌హమ్‌లో జరిగిన తొలి వన్డేలో టీమిండియా.. 6 వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 259 పరుగుల ఛేదనను భారత్.. 45.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. శుభ్‌మన్ గిల్ (75 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 80 రిటైర్డ్ హర్ట్) కెప్టెన్ ఇన్నింగ్స్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ పటేల్ (52 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 నాటౌట్) ఆల్‌రౌండ్ మెరుపులకు తోడు వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) రాణించాడు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. 47.5 ఓవర్లలో 258 రన్స్‌కు ఆలౌట్ అయింది. 80కే 5 కీలక వికెట్లు కోల్పోయిన దశలో ఆ జట్టును జో రూట్ (76 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 76 నాటౌట్), లియామ్ డాసన్ (83 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 68) ఆదుకున్నారు. బ్యాట్‌తో మెరిసిన అక్షర్.. బంతితో (4/62) నాలుగు వికెట్లు తీయగా ప్రసిద్ధ్ (2/50), యువ పేసర్ గుర్నూర్ బ్రార్ (2/61)కు తలా రెండు వికెట్లు దక్కాయి. ఈనెల 16న కార్డిఫ్‌లో రెండో వన్డే జరుగుతుంది.

### ముందు గిల్.. తర్వాత అక్షర్

రెండు బౌండరీలతో ఛేదనను మొదలెట్టిన సారథి గిల్.. సీనియర్లు రోహిత్ (11), కోహ్లీ (5) వెంటవెంటనే నిష్క్రమించినా కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెప్పించాడు. శ్రేయస్ (35) అండతో నిలకడగా ఆడాడు. వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీకి తరలించిన అతడు.. కరన్ 20వ ఓవర్లో అర్ధ సెంచరీని పూర్తిచేసుకున్నాడు. అదిల్ ఓవర్లో రెండు ఫోర్లు బాదిన అతడు.. బెతెల్, జాక్స్‌నూ అలవోకగా ఎదుర్కొని శతకం దిశగా సాగాడు. మరో ఎండ్‌లో శ్రేయస్ అతడికి చక్కటి సహకారం అందించడంతో భారత్ లక్ష్యం వైపుగా కదిలింది. మూడో వికెట్‌కు వంద పరుగులు జోడించి ఛేదన వైపుగా సాగుతున్న సమయంలో గిల్ కుడికాలి గాయంతో ఇబ్బందిపడి మైదానాన్ని వీడాడు. ఇంగ్లండ్ దీనిని ఒక అవకాశంగా మలుచుకుని వరుసగా వికెట్లు పడగొట్టి పోటీలోకి వచ్చింది. ఆర్చర్ 27వ ఓవర్లో సింగిల్ తీసే క్రమంలో శ్రేయస్.. బ్రూక్ డైరెక్ట్ త్రోకు బలయ్యాడు. ఆ వెంటనే రాహుల్ (1) టంగ్ వేసిన బాల్‌ను వికెట్ల మీదకు ఆడుకుని క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అయితే అక్షర్, వాషింగ్టన్ మాత్రం ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. ఈ జోడీ అభేద్యమైన ఐదో వికెట్‌కు 102 రన్స్ జోడించి మెన్ ఇన్ బ్లూను గెలుపుబాట పట్టించింది. బంతితో రాణించిన అక్షర్.. ఇంగ్లండ్ పేస్, స్పిన్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని వాషింగ్టన్ సహకారంతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### 4 ఓవర్లు.. 5 వికెట్లు..

మొదట నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఇంగ్లండ్.. 13వ ఓవర్ తర్వాత ఒక్కసారిగా తడబడి 4 ఓవర్ల వ్యవధిలో 5 కీలక వికెట్లు కోల్పోయింది. జాకబ్ బెతెల్ (14) నిరాశపరిచినా బెన్ డకెట్ (43) ఉన్నంతసేపు వేగంగా ఆడాడు. గుర్నూర్‌ను లక్ష్యంగా చేసుకుని అతడి 8వ ఓవర్లో 4, 6, 6తో పాటు మరుసటి ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. కానీ 13వ ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన గుర్నూర్.. నాలుగు బంతుల వ్యవధిలో ఓపెనర్లను వెనక్కి పంపి టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. ఆ వెంటనే కెప్టెన్ హ్యారీ బ్రూక్ (1).. బుమ్రా ఓవర్లో స్లిప్స్ వద్ద రోహిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. 17వ ఓవర్లో ప్రసిద్ధ్.. ఇంగ్లిష్ టీమ్‌ను మరో దెబ్బకొట్టాడు. తొలుత జోస్ బట్లర్ (5)ను బోల్తా కొట్టించిన అతడు.. నాలుగో బంతికి సామ్ కరన్‌ను డకౌట్ చేయడంతో బ్రూక్ సేన ఐదో వికెట్ కోల్పోయింది. కొద్దిసేపటికే విల్ జాక్స్ (20) సైతం దూబే బౌలింగ్‌లో కీపర్ రాహుల్ అందుకున్న సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 22 ఓవర్లకు 107/6తో పీకల్లోతు కష్టాల్లో ఉన్న ఆతిథ్య జట్టును డాసన్‌తో కలిసి రూట్ ఆదుకున్నాడు. ఈ ఇద్దరూ అనవసరపు షాట్లకు పోకుండా సింగిల్స్, డబుల్స్‌తో ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించి ఏడో వికెట్‌కు 121 రన్స్ జోడించారు. అయితే అక్షర్ పటేల్ చివరి నాలుగు వికెట్లు పడగొట్టి ఆతిథ్య జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేశాడు. 150 వన్డేల్లో బుమ్రా 150 వికెట్ల క్లబ్‌లో చేరాడు. అలాగే, ఇంగ్లండ్ గడ్డపై అత్యధికంగా 31 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జడేజా (30) రికార్డును బ్రేక్ చేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 47.5 ఓవర్లకు 258 ఆలౌట్ (రూట్ 76 నాటౌట్, డాసన్ 68, అక్షర్ 4/62);

భారత్: 45.2ఓవర్లకు 262/4 (గిల్ 80, అక్షర్ 57 నాటౌట్, టంగ్ 1/50)

# జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య

## టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

**హైదరాబాద్, జూలై 14 (ప్రజాతీర్పు)**


తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, వివిధ పత్రికలు, చానళ్ళల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదించుకోలేక పోతున్నారని అన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతునలను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

### జర్నలిస్టుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటా

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

# ఓటరు నమోదు కోసం ఊరికి వచ్చి.. యువకుడి విషాదాంతం

**నిజాంసాగర్ /జులై 14 ( ప్రజా తీర్పు)**



కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంగలి అంజయ్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ జే. శివకుమార్ తెలిపారు. పదేళ్ల క్రితం భార్య లక్ష్మి, కుమార్తె పూజతో కలిసి ఉపాధి కోసం కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లిన అంజయ్య, అక్కడ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 11న స్వగ్రామానికి వచ్చాడు. అయితే ఇంటి వద్ద ఉన్న రేకుల షెడ్డు ఐరన్ పైప్‌కు తాడుతో ఉరివేసుకున్నాడు. మంగళవారం ఉదయం గ్రామస్తుడు మంగలి రమేష్ గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, గ్రామస్తులు తాడు కోసి కిందకు దించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు, అంజయ్య మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈ నిర్ణయం తీసుకున్నాడని పేర్కొంది. అనుమానాస్పద అంశాలు లేవని ఫిర్యాదులో తెలిపిన నేపథ్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు.



# ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 14**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. పాఠశాలల ఆధునికీకరణ పై ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులతో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి క్లాస్ రూమ్‌లోనూ సరిపడా గాలి, వెలుతురు ఉండేలా చూడాలని, విద్యార్థులు కూర్చునే బెంచీలు సౌకర్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ డి ఈ రమేష్ ఏఈ ఓబులేష్ తదితరులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెట్టు కింద పుస్తకం చదువుతోన్న ఈ టాలీవుడ్ నటిని గుర్తు పట్టారా? పవన్ కల్యాణ్ సినిమాతో బాగా ఫేమస్





పలు తెలుగు సీరియల్స్, సినిమాల్లో నటించిన ఈ అందాల తార సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలన్నీ ఇన్ స్టా గ్రామ్ లోనే షేర్ చేస్తోంది. అయితే తాజాగా ఈ సీనియర్ నటి కొన్ని ఆసక్తికరమైన ఫొటోలను పంచుకుంది. పై ఫొటోలో ఉన్నదెవరో గుర్తు పట్టారా? ఆమె టాలీవుడ్ ప్రముఖ నటి. పలు సూపర్ హిట్ సీరియల్స్, సినిమాల్లోనూ నటించింది. అయితే కొన్నేళ్ల క్రితం పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఒక సూపర్ హిట్ సినిమాతో ఈ సీనియర్ నటి పేరు తెగ మార్మోగిపోయింది. ఈ నటి మరెవరో కాదు 'వకీల్ సాబ్' సినిమాలో నటించిన లిరిషా రెడ్డి అలియాస్ సూపర్ ఉమెన్. ఈ నటి అసలు పేరు సరళాదేవి అలియాస్ లిరీషా రెడ్డి. సినిమాలు,



సీరియల్స్ తో బిజీగా ఉండే ఈ నటి సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలతో పాటు తన ఫొటోలు, వీడియోలను ఇన్ స్టా గ్రామ్ లో షేర్ చేస్తుంటుంది. తాజాగా ఆమె చెట్టు కింద కూర్చుని పుస్తకం పట్టుకున్న ఫోటోలను ఇన్ స్టా గ్రామ్ లో పోస్ట్ చేయగా అవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఓ ఫొటో షూట్ లో భాగంగానే లిరిషా ఇలా కెమెరాకు డిఫరెంట్ పోజులిచ్చిందని తెలుస్తోంది. వీటిని చూసిన నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. 'ఇప్పుడేం చదువుతున్నారు మేడమ్', మేడమ్ సార్ మేడమ్ అంతే' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. మెగా స్టార్ చిరంజీవి నటించిన స్టాలిన్ చిత్రంతో సినిమా రంగంలోకి అడుగు పెట్టింది లిరిషా రెడ్డి. అందులో కమెడియన్ సునీల్ ని పెళ్లి చేసుకునే అమ్మాయిగా ఓ చిన్న పాత్ర పోషించిందామె.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020